# యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్ (UPF)

1-9-52/E/3, రాంనగర్, హైదరాబాద్ - 500 020. (T.S.) INDIA. Ph.: 040-27624030, 27624031

# దెబోరా స్వరం

సంపుటి : 9 సంచిక : 5 | సెప్టెంబరు - అక్టోబరు 2016 | విడి ప్రతి వెల రూ. 5/-


## 12. అబద్ధములు



జాయ్ చెరియన్

సంపాదకురాలి కలమునుండి...

'దెబోరాస్వరం' పాఠకులకందరికి క్రీస్తు నామములో శుభములు.

**'అబద్ధము'** ఆడుట మానవుని బలహీనత. విశ్వాసి హృదయములోనుండి అబద్ధమాడు స్వభావము తొలగించుకోవాలి. కొందరు చాలా సునాయాసముగా అబద్ధములు ఆడుతారు. అది పాపముగా వారికనిపించదు. కాని అబద్ధము లాడు పెదవులు దేవునికి హేయములని వాక్యములో ఉంది. దేవుడు అసహ్యించుకొనే పాపములలో ప్రధానమైనది అబద్ధమాడటమే. అబద్ధమాడువారు సాతాను సంబంధులు. అందుకే అబద్ధములాడే అలవాటుంటే తొలగించుకొని యేసు రక్తప్రోక్షణలో నిన్ను నీవు పరిశుద్ధపరచుకోవాలి.

దేవుడు సత్యవంతుడు. ఆయన అబద్ధమాడనేరని దేవుడు. ఆయనే సత్యమైయున్నాడు. అటువంటి సత్యవంతుడైన దేవుని పిల్లలైయుండి అబద్ధములాడుతు దేవుని పరిశుద్ధాత్మను దుఃఖపరుస్తున్నావేమో నిన్ను నీవు స్వపరీక్ష చేసికోవాలి. సత్యవంతుడైన దేవుడు నీకు తోడుగా ఉండాలంటే, నీ ప్రార్థనలు విని నీ కార్యములన్నీ సఫలము చేయాలంటే నీవు అబద్ధమాడకూడదు. ప్రతి ఒక్కరిలో ఏదో ఒక బలహీనత ఉంటుంది. ఎవ్వరము సంపూర్ణులము కాము. మన బలహీనతలో దేవుని వేడుకుంటే ఆయన సహాయము చేస్తాడు. ఆయన పరిపూర్ణుడు గనుక ఆయన పిల్లలమైన మనలను కూడ సంపూర్ణులుగా చేయగలడు.

సాతానుడు అబద్ధికుడు, అబద్ధములకు జనకుడు. ఆదికాండములోనే దేవుడు తినవద్దన్న పండు తినడానికి హవ్వను ప్రేరేపించాడు. ఆదికాం. 3వ అధ్యాయములో "ఈ పండు తింటే మీరు చావనే చావరు; మీరు దేవతలవలె ఉంటారని" అబద్ధము చెప్పాడు. సాతానుని మాటకు లొంగి దేవుని మాటకవిధేయులైనందున ఆదాము హవ్వలను దేవుడు ఏదెను తోటలోనుండి పంపివేశాడు. ఎక్కడ అబద్ధముంటుందో అక్కడ దేవుని సన్నిధి ఉండదు. అబద్ధమున్నచోట కీడు, నాశనముంటుంది. సత్యవంతుడైన దేవుడు అబద్ధికులకు తోడుగా ఉండడు. నీవు అబద్ధములాడే వ్యక్తివైతే నీవు సాతాను సంబంధివి. దేవునితోడు నీకుండదు.

**"ఆ నిత్యజీవమును అబద్ధమాడనేరని దేవుడు అనాదికాలమందే వాగ్దానము చేసెనుగాని, యిప్పుడు మన రక్షకుడైన దేవుని ఆజ్ఞప్రకారము నాకు అప్పగింపబడిన సువార్త ప్రకటనవలన తన వాక్యమును యుక్తకాలములయందు బయలుపరచెను."** - తీతుకు 1:4

**"వ్యర్థమైనవాటిని అబద్ధములను నాకు దూరముగా నుంచుము."** - సామెతలు 30:8

అని భక్తుడు ప్రార్థిస్తున్నాడు. ఎందుకంటే అబద్ధములవలన కీడు కలుగుతుంది గాని మేలేమీ కలుగదు.

ఒక వ్యక్తి అబద్ధమాడుటకు రెండు కారణములు ఉంటాయి. మొదటిది భయము. నీవు ఈ పని చేశావా? అంటే నేను చేయనేలేదు; నాకేమీ తెలియదు అంటూ తప్పును కప్పుకోవడానికి అబద్ధమాడేస్తారు. దేవుని కన్నులకు మరుగైనది ఏదియు లేదని గ్రహించాలి. నీవు మనుష్యులను తప్పించుకోవాలని అబద్ధమాడితే దేవుని శిక్షను తప్పించుకోగలవా? దేవుని కన్నులు కప్పగలవా? కావున ధైర్యముతో చేసిన తప్పు ఒప్పుకోవాలి. దానిలోనుండి విడుదల పొందాలి. రెండవది గర్వము. నీవు ఉన్నదాని కంటె ఎక్కువగా మనుష్యులు నిన్ను అంచనా వేయాలని, నీ గూర్చి నీవు గొప్పలు ప్రచురము చేసికుంటావు. అగ్ని జ్వాలలవంటి నేత్రములుగల దేవునికి నీ వక్రబుద్ధి తెలుసు. నీ గర్వము నిన్ను నశింపజేస్తుంది. అబద్ధమాడేవారు దాని చేదు ఫలమును వారి జీవితములో అనుభవిస్తారు. వారికి కీడు, నష్టము సంభవిస్తాయి. వారి ప్రయత్నములన్నీ విఫలమవుతాయి. కుటుంబములు కూలిపోతాయి. నీలో సత్యము ఉన్నప్పుడే నీ యోచనలన్నిటిని దేవుడు స్థిరపరుస్తాడు. నీ ఉద్దేశ్యము యథార్థముగా ఉన్నప్పుడే ప్రతి కార్యములో విజయము పొందుతావు.

**"నిజమాడు పెదవులు నిత్యము స్థిరమై యుండును అబద్ధమాడు నాలుక క్షణమాత్రమే యుండును."** - సామెతలు 12:19

వెయ్యి అబద్ధములాడియైన ఒక పెళ్లి చేయాలి; వంద అబద్ధములాడి ఇల్లు కట్టాలని అంటారు. అలా చేసిన పెళ్లి నిలువదు, ఇల్లు నిలువదు. అపొస్తలుల కార్యములు 5వ అధ్యాయములో అననీయ సప్పీరా దంపతులిరువురు ఏకమై అబద్ధమాడారు, దాని ఫలితము ఇద్దరూ అక్కడే అప్పుడే మరణించారు. అబద్ధమాడి దేవుని పరిశుద్ధాత్మను మోసపుచ్చారు. అంత కీడు వాటిల్లుతుందని ఊహించలేదు. దీనిని ధ్యానించడము ద్వారా అబద్ధమాడాలంటే భయపడాలి.

**"అబద్ధికులందరును అగ్నిగంధకములతో మండు గుండములో పాలుపొందుదురు;"** - ప్రకటన 21:8

కొందరు చిన్న అబద్ధమే ఏమీ ఫర్వాలేదని తేలికగా తీసికుంటారు. అబద్ధము చిన్నదైనా, పెద్దదైనా అబద్ధమే. తప్పు తప్పే. మరికొందరు White Lie అంటే ఎవరికి హాని కలుగకుండ అబద్ధమాడితే తప్పేమీ లేదు అంటారు. కొందరు వారి పిల్లలకు చిన్నప్పటినుండి అబద్ధమాడటము నేర్పిస్తారు. అప్పులవాళ్లు వచ్చి తలుపు తడితే, డాడి ఇంట్లో లేడని చెప్పుమని చిన్నబిడ్డలకు చెపుతారు. విశ్వాసులు ఇలాంటివన్నీ మానుకోవాలి. దైవభయము కలిగి అబద్ధమాడే పాపమునుండి విడుదల పొందాలి.

కొందరు వ్యర్థముగా ఇతరులను పొగడుతుంటారు. హృదయములో ఇతరుల గూర్చి మంచి అభిప్రాయమేమీ ఉండదు గాని పెదవులతో పొగడుతుంటారు లేని వాటిని ఉన్నట్లుగా మాట్లాడుతారు. అది కూడ దేవుని దృష్టిలో అబద్ధముతో సమానము. దేవుడు హృదయాంతరంగములు పరిశోధించువాడనే భయము నీలో ఉండాలి. కొన్నిసార్లు ఉన్నవాటికంటె ఎక్కువ చేసి గొప్పలు మాట్లాడుతారు. ఒక మీటింగ్‌కు 500 మంది హాజరైతే 5,000 మంది వచ్చారని, పదిమంది బాప్తిస్మము తీసికుంటే వందమంది బాప్తిస్మము తీసికున్నారని చెబుతారు. ఇది కూడ అబద్ధమే. సత్యవంతుడైన దేవుని సేవ చేస్తూ సత్యమే చెప్పాలి. అబద్ధములకు దూరముగా ఉండాలి.

**"ఎవడైనను - నేను దేవుని ప్రేమించుచున్నానని చెప్పి, తన సహోదరుని ద్వేషించినయెడల అతడు అబద్ధికుడగును; తాను చూచిన తన సహోదరుని ప్రేమింపనివాడు తాను చూడని దేవుని ప్రేమింపలేడు."** - 1 యోహాను 4:20

నేను దేవుని ప్రేమిస్తున్నాను అని చెప్పి, తన సహోదరుని ద్వేషిస్తే అబద్ధికుడవౌతావు. ఎందుకంటే దేవుడు ప్రేమాస్వరూపి. దేవుని ప్రేమించే వారు తోటిసహోదరులను కూడా ప్రేమించాలి. నాకు వాక్యమంతా తెలుసు నేను దేవుని సేవ చేస్తున్నాను అంటూ ఇతరుల యెడల ప్రేమ లేకుంటే నీవు అబద్ధికుడవు. చూచే సహోదరుని ప్రేమించకుండ చూడని దేవుని ఎలా ప్రేమించగలవు? అని యోహాను భక్తుడు వ్రాస్తున్నాడు.

**"ఆయనతోకూడ సహవాసముగలవారమని చెప్పుకొని చీకటిలో నడిచినయెడల మనమబద్ధమాడుచు సత్యమును జరిగింపకుందుము. అయితే ఆయన వెలుగులోనున్న ప్రకారము మనమును వెలుగులో నడిచినయెడల, మనము అన్యోన్యసహవాసము గలవారమై యుందుము; అప్పుడు ఆయన కుమారుడైన యేసు రక్తము ప్రతి పాపమునుండి మనలను పవిత్రులనుగా చేయును. మనము పాపములేనివారమని చెప్పుకొనిన యెడల, మనలను మనమే మోసపుచ్చుకొందుము; మరియు మనలో సత్యముండదు."** - 1 యోహాను 1:6-8

దేవుడు వెలుగై యున్నాడు. వెలుగైయున్న దేవునితో సహవాసము కలిగియున్నామని అంటూనే చీకటి కార్యములు జరిగిస్తు పాపపు అంధకారములో నడుస్తుంటే నీవు అబద్ధమాడుతున్నావు. నీలో సత్యము లేదు. మిమ్మును మీరే మోసపుచ్చుకుంటున్నారు. అట్టివారిమీద దేవుని ఉగ్రత వస్తుంది. పశ్చాత్తాపముతో ప్రభువు దగ్గరకు వస్తే యేసురక్తము ప్రతి పాపమునుండి పవిత్రులనుగా చేస్తుంది. దేవుడు అనుగ్రహించిన నాలుకతో అబద్ధములు వ్యర్థమైన మాటలు పలుకవద్దు. హృదయము నిండిన దానినిబట్టి నోరు పలుకుతుంది. నీ హృదయంలో కపటము, మోసము, కల్మషం, అబద్ధములు నింపుకుంటే అవే నీ నోటినుండి బయటకు వస్తాయి. దేవునితో అన్యోన్యసహవాసము కలిగి యుండాలంటే నీలోని ప్రతి పాపమును విడిచిపెట్టాలి. ప్రతి చీకటికార్యమును వదిలి వెలుగు సంబంధులవలె నడుచుకోవాలి.

**"యెహోవా, నీ గుడారములో అతిథిగా ఉండదగినవాడెవడు? నీ పరిశుద్ధ పర్వతముమీద నివసింపదగినవాడెవడు? యథార్థమైన ప్రవర్తన గలిగి నీతి ననుసరించుచు హృదయపూర్వకముగా నిజము పలుకువాడే. అట్టివాడు నాలుకతో కొండెములాడడు, తన చెలికానికి కీడు చేయడు తన పొరుగువానిమీద నింద మోపడు. అతని దృష్టికి నీచుడు అసహ్యుడు. అతడు యెహోవాయందు భయభక్తులు గలవారిని సన్మానించును. అతడు ప్రమాణముచేయగా నష్టము కలిగినను మాట తప్పడు."** - కీర్తన 15:1-4

నీవు దేవునితో సన్నిహితమైన సంబంధము కలిగియుండాలి, ఆయన పరిశుద్ధ పర్వతముమీద నివసించాలి అంటే నీవు కొన్ని పనులు చేయాలని కీర్తనకారుడు వివరిస్తున్నాడు. యథార్థమైన ప్రవర్తన గలిగి నీతినను సరించుచు హృదయపూర్వకముగా నిజము పలకాలి. నాలుకతో కొండెము లాడవద్దు అంటున్నాడు. అంటే అబద్ధములు మాట్లాడవద్దని అర్థము. ఇతరులమీద కొండెములు చెప్పటము, నిందలు మోపడము, నీ నాలుకతో ఇతరులకు కీడు కల్పించడము, వ్యర్థముగా ప్రమాణము చేయడము వంటివి దేవునికి అసహ్యమైన కార్యములు. కొందరు వ్యర్థముగా ప్రమాణము చేసి మాట తప్పుతారు. మన దేవుడు మాట సెలవిస్తే దానిని నెరవేర్చే దేవుడు. ఆయన అబద్ధమాడుటకు నరుడు కాడు, మాట తప్పుటకు మానవుడు కాడు, అందుకే మన మాట అవునంటే అవును, కాదంటే కాదని యుండవలెను. అంతకు మించినది దుష్టునినుండి పుట్టునది.

**"మీ మాట అవునంటే అవును, కాదంటే కాదు అని యుండవలెను, వీటికి మించునది దుష్టునినుండి పుట్టునది;"** - మత్తయి 5:37

**"యెహోవా పర్వతమునకు ఎక్కదగినవాడెవడు? ఆయన పరిశుద్ధ స్థలములో నిలువ దగినవాడెవడు? వ్యర్థమైనదానియందు మనస్సు పెట్టకయు కపటముగా ప్రమాణము చేయకయు నిర్దోషమైన చేతులును శుద్ధమైన హృదయమును కలిగియుండువాడే."** - కీర్తనలు 24:3,4

దేవుడు అంతరంగములో సత్యము కోరువాడు కావున నీవు శుద్ధ హృదయం, నిర్దోషమైన చేతులు కలిగియుండాలి. దావీదు భక్తుడు పాపము చేశాడు గాని ఎప్పుడైతే నాతాను ప్రవక్త వచ్చి గద్దించాడో అప్పుడు తప్పు ఒప్పుకొని పశ్చాత్తాప హృదయముతో తన తప్పు క్షమించుమని, నాయందు శుద్ధహృదయం దయచేయుమని, విరిగి నలిగిన హృదయముతో దేవుని వేడుకున్నాడు. చేసిన తప్పు ఒప్పుకొని దానిని విడిచిపెట్టేవారు దేవుని కనికరము పొందుతారు.

**"నా దోషము పోవునట్లు నన్ను బాగుగా కడుగుము. నా పాపము పోవునట్లు నన్ను పవిత్రపరచుము."** - కీర్తనలు 51:2

**"దేవా, నాయందు శుద్ధహృదయము కలుగజేయుము."** - కీర్తనలు 51:10

పరిశుద్ధతకొరకు దావీదు చేసిన ప్రార్థనే 51వ కీర్తన. దావీదు మహారాజు ఆయన తన కనుసైగతో నాతాను ప్రవక్తను శిరచ్ఛేధనం చేయించవచ్చు. కాని దేవుని యందలి భయముతో ప్రవక్త గద్దింపుకు లోబడి తప్పు ఒప్పుకొని దానిని విడిచిపెట్టి పరిశుద్ధతకొరకు దేవుని సన్నిధిలో పశ్చాత్తాపహృదయముతో ప్రార్థించాడు. అందుకే దావీదు దేవుని హృదయానుసారుడయ్యాడు. చేసిన తప్పును కప్పుకొని పరిశుద్ధులుగా నటించడము కూడ అబద్ధమే. అట్టివారు దేవుని శిక్షకు పాత్రులవుతారు.

అబద్ధములు ఆడుటకు నిన్ను ప్రేరేపించేది దుష్టుడు. అబద్ధము ఎప్పుడూ ఒంటరిగా రాదు. ఒక అబద్ధము కప్పడానికి ఇంకొక అబద్ధ మాడుతారు. ఇలా చేయడమువలన మీ మనస్సాక్షి వాతవేయబడుతుంది. నిన్ను దేవునికి దూరము చేస్తుంది. నీవు దేవుని సన్నిధిలో నిలువలేవు. పరిశుద్ధాత్ముడు దుఃఖపడి నీలోనుండి వెడలిపోతాడు. అందుకే నీలో అబద్ధమాడే స్వభావముంటే తొలగించుకోవాలి. ఎప్పుడు నిర్మలమైన మనస్సాక్షి కలిగినవారమై పరిశుద్ధాత్మతో నింపబడి ప్రోక్షింపబడిన హృదయముగలవారై సత్యమే పలకాలి.

దేవుడు మోషే ద్వారా ఇశ్రాయేలు ప్రజల కిచ్చిన పది ఆజ్ఞలలో ఒకటి **"నీ పొరుగువానిమీద అబద్ధ సాక్ష్యము పలుకకూడదు."** కాని అదే ఇశ్రాయేలు ప్రజలు యేసు ప్రభువుమీద అబద్ధ సాక్ష్యము పలికి ఆయనను సిలువకు అప్పగించారు.

**"దురాలోచనలు నరహత్యలు వ్యభిచారములు వేశ్యాగమనములు దొంగతనములు అబద్ధసాక్ష్యములు దేవదూషణలు హృదయములో నుండియే వచ్చును."** - మత్తయి 15:19

అబద్ధ సాక్ష్యములు, దేవదూషణలు హృదయములోనుండి వచ్చి నిన్ను అపవిత్రపరుస్తాయి. కాబట్టి నీ హృదయమును భద్రంగా కాపాడుకోవాలి. హృదయములోనుండి జీవధారలు బయలుదేరాలి గాని పాపపు తలంపులు కాదు. నీ హృదయము పరిశుద్ధాత్మకు నిలయముగా ఉండాలి. ఒక నరునికి భయపడి అబద్ధమాడకూడదు. ఇతరుల మెప్పు కొరకు అబద్ధమాడే అలవాటుంటే మానుకోవాలి. విస్తారమైన మాటలలో దోషముంటుంది. కనుక తక్కువగా మాట్లాడితే అబద్ధములకు ఆస్కారముండదు. నీ నోటిమాటలు హృదయ ధ్యానము దేవుని దృష్టికి అంగీకారముగా ఉండాలి. నీ హృదయంలో దేవుని మాటలు భద్రపరచు కుంటే నీలోని అపవిత్రతంతా తొలగిపోతుంది.

**"నేను మీతో చెప్పిన మాటనుబట్టి మీరిప్పుడు పవిత్రులై యున్నారు."** - యోహాను 15:3

**"యెహోవాకు అసహ్యములైనవి ఆరు గలవు ఏడును ఆయనకు హేయములు. అవేవనగా, అహంకారదృష్టియు కల్లలాడు నాలుకయు నిరపరాధులను చంపు చేతులును దుర్యోచనలు యోచించు హృదయమును కీడు చేయుటకు త్వరపడి పరుగులెత్తు పాదములును లేనివాటిని పలుకు అబద్ధసాక్షియు అన్నదమ్ములలో జగడములు పుట్టించువాడును."** - సామెతలు 6:16-19

దేవుడైన యెహోవాకు అసహ్యమైన కార్యములు నీలో ఉంటే వాక్యమనే అద్దములో నిన్ను చూసికొని తొలగించుకోవాలి. నీ ప్రవర్తన సరిచేసి కోవాలి. కల్లలాడు నాలుక నీకుంటే సరిచేసికోవాలి. నీవు పాపము చేసి మనుష్యుల కన్నులు కప్పగలవేమో గాని దేవుని కన్నులు కప్పలేవు. నీ పాపమే నిన్ను పట్టుకుంటుంది జాగ్రత్త! దైవభయము కలిగి నీ ప్రవర్తన దేవుని వాక్యమునకు అనుగుణముగా చక్కబెట్టుకొని దేవునికి అసహ్యమైన ప్రతి నీచకార్యమును విడిచి మాదిరికరమైన పరిశుద్ధ జీవితము జీవించాలి.

**"అబద్ధమాడు పెదవులు యెహోవాకు హేయములు సత్యవర్తనులు ఆయనకిష్టులు."** - సామెతలు 12:22

కాబట్టి అబద్ధమాడే స్వభావము నీకుంటే విడిచిపెట్టాలి. ఎల్లప్పుడు సత్యమే పలకాలి. అప్పుడు సత్యవంతుడైన దేవుడు నీకు తోడైయుండి నిన్ను నీ కుటుంబమును ఆశీర్వదిస్తాడు. నీవు చేయు ప్రతి కార్యమును సఫలపరుస్తాడు.

**ప్రార్థన:** ప్రభువా, 'అబద్ధమాడుట' నీకసహ్యమైన కార్యము అని నేర్చుకున్నాము. అబద్ధమాడే స్వభావము మాలోనుండి తొలగించు. నీ రక్తముచేత మమ్ము కడిగి పవిత్ర పరచుము. యథార్థమైన హృదయముతో ఎల్లప్పుడు సత్యమే మాట్లాడే కృపను దయచేయుమని యేసు నామములో అడుగుతున్నాము తండ్రీ. ఆమేన్!


## యు.పి.ఎఫ్. ఇంగ్లీషు ఆరాధన

యు.పి.ఎఫ్. **ఇంగ్లీషు ఆరాధన** ప్రతి ఆదివారము
సా॥ 4 గం॥ల నుండి 6 గం॥ల వరకు
ఉస్మానియా గార్డెన్ ఫంక్షన్ హాల్, అడిక్‌మెట్‌లో జరుగును.
అనంతరం సా॥ 6 గం॥ల నుండి రా॥ 8.30 ని॥ల వరకు
**తెలుగు ఆరాధన** జరుగునని తెలియజేస్తున్నాము.

**అందరికీ ఆహ్వానము** - జాయ్ చెరియన్

## దయచేసి గమనించండి

UPF Ph. 040-27624030, 27624031

"యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్" పరిచర్యలకు మీరు పంపదలచిన విరాళాలను బ్యాంకు ద్వారా మాకు పంపగలరు.
మీరు ఈ సదవకాశాన్ని వినియోగించుకొని దేవుని సేవలో తోడ్పడగలరు.
బ్యాంకు మరియు ఖాతా వివరాలు :

**United Peoples Fellowship, Current a/c no. 13391100000946 Andhra Bank, Ramnagar.**

IFSC Code ANDB0001339 ఐ.ఎఫ్.ఎస్.సి. కోడ్ ANDB0001339

ఆన్‌లైన్ ద్వారా విరాళము పంపేవారు పంపిన తేదీ, పూర్తి పేరు, చిరునామా, ఫోన్ నెంబర్ తెలియపరచగలరు.

# దేవుని సహస్రనామములు

గత సంచిక తరువాయి...

## 248. అన్నవస్త్రముల ననుగ్రహించువాడు

- ద్వితీ.కాం. 10:18

**"ఆయన తలిదండ్రులు లేనివానికిని విధవరాలికిని న్యాయము తీర్చి, పరదేశియందు దయయుంచి అన్నవస్త్రముల ననుగ్రహించువాడు."**

- ద్వితీ.కాం. 10:18

సాధారణముగా దేవుడు శరీరమునకే పోషకుడని చాలామంది అనుకుంటారు. కాని ఆయన శరీరమునకు రక్షకుడు, ఆత్మకు, ప్రాణమునకు రక్షకుడు; పోషకుడై యున్నాడు. ఆయన శరీరాత్మ ప్రాణములను పోషిస్తాడు, రక్షిస్తాడు.

ఆయన శిష్యులను గద్దిస్తూ మీరెందుకు ఆందోళనగా ఉన్నారు, ఎందుకు సందేహిస్తున్నారు. ఏమి తిందుమో? ఏమి త్రాగుదుమో? ఏమి ధరించుకొందుమో? అని ఎందుకు చింతిస్తున్నారు. ఆయనే మీకు అన్నవస్త్రములను అనుగ్రహిస్తాడని చెప్పాడు.

**"అందువలన నేను మీతో చెప్పునదేమనగా - ఏమి తిందుమో యేమి త్రాగుదుమో అని మీ ప్రాణమును గూర్చియైనను ఏమి ధరించు కొందుమో అని మీ దేహమును గూర్చియైనను చింతింపకుడి; ఆహారము కంటె ప్రాణమును, వస్త్రముకంటె దేహమును గొప్పవి కావా? ఆకాశపక్షులను చూడుడి; అవి విత్తవు కోయవు కొట్లలో కూర్చుకొనవు; అయినను మీ పరలోకపు తండ్రి వాటిని పోషించుచున్నాడు; మీరు వాటికంటె బహు శ్రేష్ఠులు కారా? మీలోనెవడు చింతించుటవలన తన యెత్తు మూరెడెక్కువ చేసికొనగలడు? వస్త్రములను గూర్చి మీరు చింతింపనేల? అడవిపువ్వులు ఏలాగు నెదుగుచున్నవో ఆలోచించుడి. అవి కష్టపడవు, ఒడకవు. అయినను తన సమస్త వైభవముతో కూడిన సొలొమోను సహితము వీటిలో నొకదాని వలెనైనను అలంకరింపబడలేదు. నేడుండి రేపు పొయ్యిలో వేయబడు అడవి గడ్డిని దేవుడీలాగు అలంకరించిన యెడల, అల్పవిశ్వాసులారా, మీకు మరి నిశ్చయముగా వస్త్రములు ధరింపజేయును గదా. కాబట్టి - ఏమి తిందుమో యేమి త్రాగుదుమో యేమి ధరించుకొందుమో అని చింతింపకుడి; అన్యజనులు వీటన్నిటి విషయమై విచారింతురు. ఇవన్నియు మీకు కావలెనని మీ పరలోకపు తండ్రికి తెలియును. కాబట్టి మీరు ఆయన రాజ్యమును నీతిని మొదట వెదకుడి; అప్పుడవన్నియు మీకనుగ్రహింపబడును. రేపటినిగూర్చి చింతింపకుడి; రేపటి దినము దాని సంగతులనుగూర్చి చింతించును; ఏనాటికీడు ఆనాటికి చాలును."**

- మత్తయి 6:25-34

ఆయనే నీకు అన్నవస్త్రములను అనుగ్రహించువాడు. దీని అర్థము ఏంటంటే మీరు ఆందోళన చెందకండి. మీలో అల్పవిశ్వాసము ఉండ కూడదు. అవిశ్వాసులు అనడములేదు కాని అల్పవిశ్వాసులంటున్నాడు. నీ విశ్వాసము ఎక్కువ చేసికోవాలి. నీలో ఇంకా ఆందోళన, దిగులు, భయముంది. నీ పిల్లలు ఏమి తింటారో, ఎక్కడుంటారో, ఏమి ధరించుకుంటారోనని మీరెందుకు చింతిస్తున్నారు? మీరు దిక్కులేని పిల్లలు కాదు. నేను మీ పరలోకపు తండ్రిని. మీకొరకు నా కుమారుని అనుగ్రహించడానికి వెనుక తీయలేదు. ఆయనతో పాటు సమస్తము ఎందుకు అనుగ్రహించను అని సవాల్ చేస్తున్నాడు. మీకొరకు ప్రాణము పెట్టాను. నా రూపములో సృష్టించుకున్నాను. మీకు ఏదీ తక్కువ చేయను. మీరు నా పిల్లలగుటకు అధికారమిచ్చాను. దిక్కులేని అనాథలు కారు. మీరు నా పిల్లలు, నేను మీకు తండ్రిని. తండ్రి ఎప్పుడూ తన బిడ్డలకు యేమి కావాలో శ్రద్ధ వహిస్తాడు చింతిస్తాడు. నేను మిమ్మునుగూర్చి చింతిస్తున్నాను, కనుక మీ చింత యావత్తు నామీద వేయండి అంటున్నాడు.

రేపటినిగూర్చి ఆలోచించవద్దని చెప్పి నిండా దుప్పటికప్పుకొని పడుకుంటే సరిపోదు. ఆకాశపక్షులను చూడుడి అన్నాడు. ఆకాశపక్షులు గూట్లోనే కూర్చునియుంటే దేవుడు ఆహారము తెచ్చి నోటికందించడము లేదు కాని వాటికొరకు ఆహారము సిద్ధపరుస్తున్నాడు. తెల్లవారకముందే పక్షులు లేచి దేవుని స్తుతించి వాటికి కావలసిన ఆహారముకొరకు మట్టిలో అటు ఇటూ గోళ్లతో కెలికి వాటికి కావలసిన చెదలు, పురుగులు ఏరుకుంటాయి. దేవుడు దానికి కావలసింది సిద్ధపరుస్తున్నాడు. కాని సోమరిగా గూట్లోనే వుంటే తీసికెళ్లి నోట్లో పెట్టడము లేదు. రేపటి గురించి ఆలోచించవద్దని చెప్పి ఏ పని చేయకుండ సోమరిలాగా కూర్చోకూడదు. సోమరీ, చీమలను చూచి నేర్చుకోమని వాక్యం బోధిస్తుంది. నీవు కష్టపడాలి. పనిచేయాలి. దేవుడు నీకు తోడుగా ఉండి ప్రతి ప్రయత్నము సఫలము చేస్తాడు. నీ కష్టార్జితమును దీవిస్తాడు. నీ చేతుల కష్టార్జితమును అనుభవిస్తావు. ఆయన నీకు ఏమీ తక్కువ చేయడు. నీతిమంతులు విశ్వాసము మూలముగా బ్రతుకుతారు. దేవుని రాజ్యమును నీతిని మొదట వెదకాలి. అప్పుడు ఆయన నీకు సమస్తము అనుగ్రహిస్తాడు.

ఏమి తిందుమో, ఏమి త్రాగుదుమో అనే ఆలోచన, ఆందోళన దేవుని బిడ్డలకు తగదు. అన్యజనులు వీటన్నిటి విషయము ఆలోచిస్తారు చింతిస్తారు. నీకేమి కావాలో నీ పరలోకపు తండ్రికి తెలుసు. ఆయన నిన్ను గూర్చి చింతిస్తున్నాడు. నీకు కావలసినవన్ని తగిన సమయంలో దేవుడిస్తాడు. నీవు కష్టపడి పనిచేయాలి. నీ శ్రమను ఆయన ఆశీర్వదిస్తాడు. నీవు వెదకాల్సింది వెదకాలి. కనుగొనాల్సింది కనుగొనాలి. ఆయన నీతిని, రాజ్యమును వెదకాలి. ఆయన సన్నిధిని ఆయన బలమును వెదకాలి. ఈ లోకరీతిగా కావలసిన అన్నవస్త్రములుకొరకు నీవు చింతించకు. అన్నవస్త్రములను అనుగ్రహించే దేవుడు తప్పకుండా నీకు దయచేస్తాడు.

**"దేనినిగూర్చియు చింతపడకుడి గాని ప్రతి విషయములోను ప్రార్థన విజ్ఞాపనములచేత కృతజ్ఞతాపూర్వకముగా మీ విన్నపములు దేవునికి తెలియజేయుడి. అప్పుడు సమస్త జ్ఞానమునకు మించిన దేవుని సమాధానము యేసుక్రీస్తువలన మీ హృదయములకును మీ తలంపులకును కావలియుండును."** - ఫిలిప్పీ. 4:6,7

నీవు చేయవలసింది, చేయగలిగింది చేసి, దేవుని చిత్తమునకు అప్పగించు. దేనిని గూర్చి చింతించకుండ ప్రతి విషయములో ప్రార్థించాలి.

దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించాలి. నీతిమంతులను ఆయన ఎన్నడును పస్తు ఉండనీయడు. ఈ రోజు ఒకవేళ నీకు ఆహారము, సరియైన వస్త్రములు లేని దీన స్థితిలో వుంటే అన్నవస్త్రములననుగ్రహించువాడా అని స్తుతించి ప్రార్థించు. తప్పక ఆయన నీ దీనస్థితిని కటాక్షించి నీకు సర్వసమృద్ధి నిస్తాడు. అన్నవస్త్రములను ధారాళముగా దయచేస్తాడు.

## 249. నన్ను యథార్థమార్గమున నడిపించువాడు

- కీర్తనలు 18:32

**"నాకు బలము ధరింపజేయువాడు ఆయనే నన్ను యథార్థ మార్గమున నడిపించువాడు ఆయనే."** - కీర్తనలు 18:32

ఆయన యథార్థవంతుడు. ఆయన బిడ్డవైన నిన్ను ఆయన యథార్థమార్గములో నడిపిస్తాడు. ఆయనే మార్గము. ఆయన తన భక్తులను యథార్థమార్గములో నడిపిస్తాడు. భక్తిహీనుల మార్గమును వంకరగా చేస్తాడు. వారు ఎటు పయనమవుతున్నారో వారికి తెలియదు. దేవుని ఆశ్రయించేవారిని శ్రేష్ఠమైన చక్కని యథార్థమార్గములో నడిపిస్తాడు.

ఒక శుక్రవారము ఉపవాస ప్రార్థనలో కొంతమంది సహోదరీలు సంఘములో నిలువబడి తమ తప్పులు ఒప్పుకున్నారు. సంఘమంతా వారికొరకు ప్రార్థించారు. ఈ విషయము నాకు చాలా అద్భుతముగా అనిపించింది. వారిని యథార్థమార్గములో దేవుడే నడిపిస్తున్నాడు. తప్పు చేశాను. దేవునికి, దైవజనులకు విరుద్ధముగా మాట్లాడినాను. అప్పటి నుండి మాకు నెమ్మది లేదు. క్షమించమని అడిగారు. దేవుడు తప్పక క్షమిస్తాడు. ఆ క్షణమందే నేను కూడ వారిని క్షమించాను.

ఒక సహోదరుడు వచ్చి - మోకాళ్ల మీదుండి తప్పు ఒప్పు కుంటున్నాడు. లంచము పుచ్చుకొననివాడు అనే నామముమీద అమ్మగారు చేసిన ప్రసంగము విన్నప్పటినుండి నాకు నిద్రపట్టలేదు. లంచము తీసికోవడము మానేశాను. తీసికున్న నేను తిరిగి నాలుగంతలు చెల్లించలేను కాని ఇప్పటినుండి లంచము పుచ్చుకోనని చెప్పాడు. పరిశుద్ధాత్మునే ఆ సహోదరునితో మాట్లాడి యథార్థమార్గములో నడిపించాడు. దేవునికి స్తోత్రములు! మీరు కుడితట్టయినా ఎడమతట్టయినా తిరిగితే అప్పుడు ఇదే త్రోవ దీనిలోనే నడువమనే ఒక శబ్దము నీకు వినపడుతుంది. (యెషయా 30:21)

యథార్థవంతుల త్రోవ రాజమార్గముగా వుంటుంది.

**"చెడుతనము విడిచి నడచుటయే యథార్థవంతులకు రాజమార్గము."** - సామెతలు 16:17

**"ఒకని మార్గము వాని దృష్టికి యథార్థముగా కనబడును. అయినను తుదకు అది మరణమునకు చేరును."** - సామెతలు 16:25

నీ సొంత చిత్తప్రకారము వెళుతూ అంతా సరిగ్గానే వుంది అనుకుంటున్నావా? నీ దృష్టికి అది యథార్థముగా కనపడుతుందేమో కాని దేవుని దృష్టికి అది సరిగా లేదు. ఇది సరికాదని దేవుని వాక్యము నిన్ను గద్దించినప్పుడు, భక్తులు గద్దించినప్పుడు పెడచెవిన పెట్టకు. నీకు సరిగా కనబడే త్రోవ చివరకు నిన్ను మరణమునకు నడిపిస్తుంది. ఒకని నడత వాని దృష్టికి మంచిగా కనిపిస్తుంది. తుదకు అది మరణమునకు దారితీస్తుంది. కావున నన్ను యథార్థమార్గములో నడిపించుమని ప్రార్థించాలి.

**"ఆయన శాసనములను గైకొనుచు పూర్ణహృదయముతో ఆయనను వెదకువారు ధన్యులు. వారు ఆయన మార్గములలో నడచుకొనుచు ఏ పాపమును చేయరు."** - కీర్తనలు 119:2,3

నిన్ను యథార్థమార్గములో నడిపించే యథార్థవంతుడైన దేవుని బీజము నీలో ఉంది. కనుక నీవు ఏ పాపము చేయలేవు. కనుక నీవు నీతియుక్తముగా నడుచుకుంటావు. నీ సాక్ష్యము ప్రభువుకు మహిమ తెచ్చేదిగా వుండాలి. మందిని ముంచే త్రోవలో నడువకు. ఒకవేళ నీ జీవితము అలాగుంటే ప్రార్థించు. యథార్థమైన మార్గములో నడిపించు వాడా, నన్ను యథార్థమార్గములో నడుపుమని ప్రార్థించు. పాలమ్మే వ్యాపారమయితే పాలలో నీళ్లు కలుపకు. నకిలీ కారంపొడితో మందిని ముంచకు. ఆయన యథార్థవంతుడు. యథార్థమైన మార్గములో నడువు. నీవు ప్రార్థిస్తే తప్పకుండ నిన్ను యథార్థమైన మార్గములో నడిపిస్తాడు. యథార్థముగా ప్రవర్తించువారికి ఆయన యే మేలును చేయక మానడు. యథార్థవంతులు ఆయన ముఖదర్శనము చేస్తారు.

## 250. నిన్ను పంపినవాడు

- న్యాయాధి. 6:14

**"అంతట యెహోవా అతనితట్టు తిరిగి - బలము తెచ్చుకొని వెళ్లి మిద్యానీయుల చేతిలోనుండి ఇశ్రాయేలీయులను రక్షింపుము, నిన్ను పంపినవాడను నేనే అని చెప్పగా."** - న్యాయాధి. 6:14

నిన్ను పంపినవాడను నేనే అని గిద్యోనుతో యెహోవా చెపుతున్నాడు. ఈ వాక్యభాగములో ఇశ్రాయేలీయులు దేవుని మాట విననందున దేవుడు వారిని శత్రువులైన మిద్యానీయుల చేతికి అప్పగించాడు. ఇశ్రాయేలీయులు దేవుని దృష్టికి దోషులయ్యారు.

**"ఇశ్రాయేలీయులు యెహోవా దృష్టికి దోషులైనందున యెహోవా యేడేండ్లు వారిని మిద్యానీయుల కప్పగించెను. మిద్యానీయుల చెయ్యి ఇశ్రాయేలీయులమీద హెచ్చాయెను గనుక వారు మిద్యానీయులయెదుట నిలువలేక కొండలోనున్న వాగులను గుహలను దుర్గములను తమకు సిద్ధపరచుకొనిరి."** - న్యాయాధి. 6:1,2

ఇశ్రాయేలీయులను - మిద్యానీయులు ఎంతగానో బాధిస్తున్నప్పుడు వారు తాళలేక దేవునికి మొఱ్ఱపెట్టారు. అప్పుడు యెహోవా దూత గిద్యోనుకు కనబడి అతనిని ధైర్యపరచి నీవు వెళ్లి ఇశ్రాయేలీయులను మిద్యానీయుల చేతిలోనుండి రక్షించమని చెప్తాడు. ఈ నామము ధ్యానిస్తున్న వారికి హెచ్చరిక. నీవు దేవుని మాట వినకుంటే నిన్ను శత్రువు చేతికి అప్పగిస్తాడు జాగ్రత్త! నీవు దేవుని మాట వినకుండ, యథార్థమైన మార్గములలో నడువకుంటే శత్రువు చేతికి అప్పగిస్తాడు. మన శత్రువు సాతాను వలలో చిక్కిపోతావు జాగ్రత్త! ఇశ్రాయేలు ప్రజలు దేవుని బిడ్డలు. దేవునిచేత ఆశీర్వదింపబడినవారు. దేవుని వాగ్దానములకు వారసులైన ప్రజలు. అయినను దేవుని మాట విననందుకు దేవుడే వారిని శత్రువులచేతికి అప్పగించాడు. తిరిగి వారు పశ్చాత్తాపముతో మొఱ్ఱపెట్టినప్పుడు కనికరము

చూపే తండ్రి అబ్రాహామునకు ఇచ్చిన వాగ్దానము నెరవేర్చాలి కాబట్టి ఇశ్రాయేలీయుల నుండి నాయకుని తయారుచేస్తున్నాడు. గానుగచాటున గోధుమలు దుళ్ళగొడుతున్న గిద్యోనుతో – నీవు వెళ్లి ఇశ్రాయేలీయులను రక్షించుమంటాడు.

**“యెహోవా దూత వచ్చి అబీయెజ్రీయుడైన యోవాషునకు కలిగిన ఒఫ్రాలోని మస్తకివృక్షము క్రింద కూర్చుండెను. యోవాషు కుమారుడైన గిద్యోను మిద్యానీయులకు మరుగైయుండునట్లు గానుగచాటున గోధుమలను దుళ్లగొట్టుచుండగా యెహోవా దూత అతనికి కనబడి - పరాక్రమముగల బలాఢ్యుడా, యెహోవా నీకు తోడైయున్నాడని అతనితో అనగా, గిద్యోను - చిత్తము నా యేలినవాడా, యెహోవా మాకు తోడైయుండినయెడల ఇదంతయు మాకేల సంభవించెను? యెహోవా ఐగుప్తులోనుండి మమ్మును రప్పించెనని చెప్పుచు, మా పితరులు మాకు వివరించిన ఆయన అద్భుత కార్యములన్నియు ఏ మాయెను? యెహోవా మమ్మును విడిచిపెట్టి మిద్యానీయుల చేతికి మమ్మును అప్పగించెనని అతనితో చెప్పెను. అంతట యెహోవా అతనితట్టు తిరిగి - బలము తెచ్చుకొని వెళ్లి మిద్యానీయుల చేతిలోనుండి ఇశ్రాయేలీయులను రక్షింపుము, నిన్ను పంపినవాడను నేనే అని చెప్పగా అతడు - చిత్తము నా యేలిన వాడా, దేని సహాయముచేత నేను ఇశ్రాయేలీయులను రక్షింపగలను? నా కుటుంబము మనష్షే గోత్రములో ఎన్నికలేనిదే. నా పితరుల కుటుంబములో నేను కనిష్ఠుడనై యున్నానని ఆయనతో చెప్పెను. అందుకు యెహోవా - అయిన నేమి? నేను నీకు తోడైయుందును గనుక ఒకే మనుష్యుని హతము చేసినట్లు మిద్యానీయులను నీవు హతముచేయుదువని సెలవిచ్చెను.”** – న్యాయాధి. 6:11-16

ఒక పిరికివాడిని దేవుడు – పరాక్రమముగల బలాఢ్యుడా అని పిలుస్తున్నాడు. నీవు భయపడకు దేవుడు నీకు తోడుగా ఉన్నాడని చెప్పినప్పుడు – దేవుడు తోడుగా వుంటే ఇదంతా మాకెందుకు సంభవించింది? మా పితరులు వివరించిన అద్భుతములన్ని ఏమాయెను? ఎఱ్ఱ సముద్రమును పాయలు చేశావు. బండనుండి నీళ్లిచ్చావు. ఆకాశము నుండి ఆహారమిచ్చావు. పూరేళ్లను కురిపించి మాంసాహారము ఇచ్చావు. పగలు మేఘస్తంభముగా రాత్రి అగ్ని స్తంభముగా ఉండి వారిని నడిపించావు. ఇప్పుడు మా ప్రాణాలు శత్రువుల చేతిలో ఉన్నాయి. మిద్యానీయులు మమ్మల్ని ఇంతగా బాధిస్తున్నారు. మరి ఈ అద్భుత కార్యములన్నీ ఏమయిపోయాయి అని దేవుని అడుగుతున్నాడు గిద్యోను. అప్పుడు దేవుడు గిద్యోనుతో బలము తెచ్చుకొని వెళ్లి మిద్యానీయుల చేతిలో నుండి ఇశ్రాయేలీయులను రక్షింపుము. నిన్ను పంపినవాడను నేనే అంటాడు. నాకేమి బలముంది? నేను పిరికివాడిని. నేనెట్లు ఈ ప్రజలను రక్షించగలను అన్నప్పుడు పరాక్రమముగల బలాఢ్యుడా నేను నీకు తోడైయున్నాను అని దేవుడు ధైర్యపరుస్తాడు. దేవుని తోడు, సహాయముతో గిద్యోను గొప్పకార్యములు చేశాడు.

కొన్నిసార్లు కొందరు భక్తులను చూస్తే ఆశ్చర్యమేస్తుంది. వీరు ఇంత గొప్ప కార్యములు ఏవిధముగా చేశారని. దేవుని తోడు, సహాయముంటే, నిన్ను పంపినవాడు నీకు తోడుగా వుంటే దేవునికొరకు గొప్ప కార్యములు చేయగలవు. నిన్నెందుకు దేవుడు ఈ లోకములోకి పంపాడు? ఎందుకు ఈ లోకానికి వచ్చావో ఆ దైవ సంకల్పమును తెలిసికోవాలి. దేవుడు నిన్ను ఒక ప్రత్యేకమైన ఉద్దేశముకొరకు ఈ లోకమునకు పంపాడు. అది సాధించాలి. దేవున్ని నీ జీవితముద్వారా మహిమపరచాలి.

ఫరో బానిసత్వమునుండి ఇశ్రాయేలీయులను విడిపించడానికి దేవుడు మోషేను ఎన్నుకున్నాడు. అప్పుడు మోషే – నేను మాట నేర్పరిని కాను. నత్తివాడను నన్ను నాయకుడిగా ఎవరు గుర్తిస్తారు? నన్ను ఎవరు పంపారంటే ఏమి జవాబివ్వాలి? నేను చెప్పే మాటలను ఇశ్రాయేలీయులు, ఫరో నమ్ముతారా? అని అడుగుతాడు. అప్పుడు దేవుడు మోషేతో – నేను ఉన్నవాడను అనువాడను అను నామము గలవాడను. మీ పితరుల దేవుడు నన్ను మీ యొద్దకు పంపెనని చెప్పమంటాడు.

**“కాగా రమ్ము, నిన్ను ఫరో యొద్దకు పంపెదను; ఇశ్రాయేలీయులైన నా ప్రజలను నీవు ఐగుప్తులోనుండి తోడుకొని పోవలెననెను. అందుకు మోషే-నేను ఫరోయొద్దకు వెళ్లుటకును, ఇశ్రాయేలీయులను ఐగుప్తులో నుండి తోడుకొని పోవుటకును ఎంతటివాడనని దేవునితో అనగా ఆయన - నిశ్చయముగా నేను నీకు తోడై యుందును, నేను నిన్ను పంపితిననుటకు ఇది నీకు సూచన; నీవు ఆ ప్రజలను ఐగుప్తులోనుండి తోడుకొని వచ్చిన తరువాత మీరు ఈ పర్వతముమీద దేవుని సేవించెదరనెను. మోషే - చిత్తగించుము; నేను ఇశ్రాయేలీయులయొద్దకు వెళ్లి వారిని చూచి - మీ పితరుల దేవుడు మీ యొద్దకు నన్ను పంపెనని వారితో చెప్పగా వారు - ఆయన పేరేమి అని అడిగిన యెడల వారితో నేనేమి చెప్పవలెనని దేవుని నడిగెను. అందుకు దేవుడు నేను ఉన్నవాడను అనువాడనై యున్నానని మోషేతో చెప్పెను.”** – నిర్గమకాం. 3:10-13

నేను సేవ ఆరంభించిన మొదటి రోజుల్లో నన్ను కొంతమంది ఈ విధముగానే అడిగారు. మిమ్మును ఎవరు పంపారని. నన్ను పంపినవాడు ఆనాటినుండి ఈనాటివరకు నాకు తోడైయుండి ఆయనకొరకు ఎన్నో బలమైన కార్యములు చేయడానికి తన శక్తిని ఇచ్చాడు.

**“అప్పుడు - నేను ఎవని పంపెదను? మా నిమిత్తము ఎవడు పోవునని ప్రభువు సెలవియ్యగా వింటిని. అంతట నేను - చిత్తగించుము నేనున్నాను నన్ను పంపుమనగా.”** – యెషయా 6:8

యెషయా ప్రవక్తతో నా నిమిత్తము ఎవరు పోతారు? నేను ఎవరిని పంపాలి అన్నప్పుడు – నేను ఉన్నాను నన్ను పంపమంటాడు. యేసుప్రభువు శిష్యులతో – నేను నా శిష్యులుగా మిమ్మును పంపుతున్నాను. సర్వలోకానికి వెళ్లి సర్వసృష్టికి సువార్త ప్రకటించమంటాడు. యుగసమాప్తి వరకు సదాకాలము తోడుగా ఉంటానని వాగ్దానము చేశాడు.

ఒకవేళ ఈ నామము చదువుతున్న నీకు దేవుని పిలుపు ఉందా? ఉంటే సందేహించకు. భయపడకు. నిన్ను పిలిచినవాడు నిన్ను పంపినవాడు నీకు తోడైయుంటాడు. నీ ద్వారా బలమైన కార్యములు చేస్తాడు. శత్రువైన సాతాను బంధకములలోనుండి లక్షలాది మందిని రక్షించడానికి నిన్ను, నన్ను ఆయన ఈ లోకమునకు పంపాడు. నిన్ను పంపినవాని చిత్తము నెరవేర్చి ఆయనను మహిమపరచు. ❀ – సశేషం

# దేవుని వెయ్యి వాగ్దానములు

గత సంచిక తరువాయి...

## 96. యెహోవా జరిగించు ఈ గొప్ప కార్యమును కనిపెట్టుడి - 1 సమూ. 12:6

తనకొరకు కనిపెట్టువారిపట్ల ఆయన గొప్ప కార్యములు జరిగిస్తాడు. దేవుడు నీకొరకు గొప్ప కార్యాలు చేస్తాడనే విషయం నీవు ఎల్లప్పుడు గుర్తుంచుకోవాలి. దేవుడు నీ జీవితంలో చేసే గొప్ప కార్యములకొరకు నీవు కనిపెట్టుకొని ఉండాలి. మా సంఘ కూడికల్లో విశ్వాసులు ఒకరితర్వాత ఒకరు లేచి ఎన్ని సాక్ష్యాలు చెబుతారో! వాక్యముద్వారా బలపడి ప్రభువును తమ రక్షకునిగా అంగీకరించి బాప్తిస్మం తీసికున్నవారు దేవుడు మమ్మును భయంకరమైన పరిస్థితినుండి విడిపించాడని దేవుడు వారి జీవితాల్లో చేసిన కార్యములు వివరిస్తారు. కొందరు రోగమునుండి విడిపింపబడ్డారని చెబుతారు. ఓ సహోదరి తాను ఘోరపాపినని, పాపంలో ఉన్న ఆమెకు దేవుడు దొరికాడని చెప్పింది. ఓ బిడ్డ త్రాగుడునుండి విడుదల పొందానని, భార్యాభర్తలిద్దరూ తీరని రోగంనుండి స్వస్థతపొంది, రోగాలు నయమై పోయాయని చెప్పారు. ఇవి స్వల్ప కార్యములా? ఇవి యెహోవా జరిగించు గొప్ప కార్యములు. ఓ అన్యురాలు యేసు ప్రభువుని స్వరక్షకునిగా అంగీకరించి బాప్తిస్మం తీసికున్నానని సాక్ష్యం చెప్పింది. అలాగుననే ఓ సర్దార్జీ సహాయంకొరకు ప్రభువును ఆశ్రయించాడు. సంతాలీ భాష మాట్లాడే ఓ సహోదరి నలుగురు చిన్న పిల్లలతో ఆలయానికి వచ్చింది. 2 సంవత్సరాలనుండి ఫోన్ ద్వారా సంఘానికి పరిచయమని, ఫోన్‌లో ఎప్పుడు ప్రార్థన చేయించుకున్నా, వెంట వెంటనే విడుదల కలిగిందని సాక్ష్యం చెప్పింది. యెహోవా చేయు గొప్ప కార్యములకొరకు నీవు కనిపెట్టాలి. నీ జీవితంలో దేవుడు ఏదో గొప్ప కార్యం చేస్తాడనే ఆశ ఎప్పుడూ నీకు ఉండాలి. ప్రతిరోజు ఉదయం లేవగానే దేవుడు నీ జీవితంలో గొప్ప కార్యం జరిగిస్తాడని ఊహించాలి. ఎందుకంటే ఆయన గొప్ప దేవుడు. ఆయన స్వభావమే గొప్పతనము. గొప్పతనం ఘనత ఆయనవలన కలుగుతుంది. ఆయన అద్భుతాలు చేయువాడు ఆశ్చర్యకరుడు. నీవు ఉదయం లేవగానే నీ పనుల భారంతో క్రుంగి, కృశించి అల్లరితో నీ దినాన్ని ఎదుర్కోవద్దు. ప్రతిదినాన్ని ప్రార్థనతో ఎదుర్కోవాలి. ప్రభువా! అనేక బాధలు, సమస్యలు, ఆటంకములు నాకు ఉన్నాయి గాని నేను గొప్ప దేవుని కుమారుడను. నాకొరకు, నా కుటుంబముకొరకు, నా సంఘముకొరకు నీవు గొప్ప కార్యాలు చేస్తావని ఎదురుచూస్తున్నాను అని ప్రార్థించాలి. నేనెప్పుడూ అలానే ఎదురుచూస్తాను. 1992వ సంవత్సరము (సంఘము ఆరంభించినప్పటి) నుండి నా సంఘములో దేవుడు చేసే గొప్ప కార్యాలకొరకు కనిపెట్టుకొని ఉంటాను. అది నా అలవాటు. ఇంకా గొప్ప కార్యాలు నేను చూడబోతున్నానని నా విశ్వాసం. విశ్వసించువాడు ఎన్నడును సిగ్గుపడడు, కలవరపడడు. కావున నీవు దేవుడు చేసే గొప్ప కార్యములకొరకు ఎదురుచూడు.

విశ్వాసులు ఎప్పుడూ నెగెటివ్‌గా (అపనమ్మకంతో) మాట్లాడవద్దు. ఫొటోయొక్క నెగెటివ్ చూస్తే ఎంత భయంకరంగా భూతములాగా ఉంటుంది. ఎవరైనా నెగటివ్ ఫొటోను వారి పాకెట్ (జేబు)లో పెట్టుకొని తిరుగుతారా? మీ నెగటివ్ ఫొటోయే మీకు భయం పుట్టిస్తుంది. అది తీసిపారేసి పాజిటివ్ ఫొటోగ్రాఫ్ పెట్టుకొని నేనెంత అందంగా ఉన్నానని ఇతరులకు చూపిస్తుంటారు. కావున నీవు నీలోని నెగెటివ్ ఆలోచనలు, చీకటి చింతలు లోకానికి ప్రదర్శించవద్దు. ప్రభువుయొక్క గొప్పతనాన్ని నీ నాలుకద్వారా ప్రచురము చేయాలి. నీ పిల్లలు నీ నోటినుండి గొప్ప మాటలే వినాలి. ఏమీ చింతించకు, దేవుడు గొప్పవాడు, మనకు తప్పక సహాయము చేస్తాడు అని తల్లిదండ్రులు ఎప్పుడూ బిడ్డలకు ధైర్యం ఇస్తూ ఉండాలి. నేను అలానే చేస్తాను. నేను చేయనిది ఎప్పుడూ చెప్పను. నేను నా ముగ్గురు పిల్లలను కూర్చోపెట్టుకొని దేవుని మాటలు మాట్లాడేదాన్ని. భయపడవద్దు, దేవుడు మన కుటుంబంపట్ల గొప్ప కార్యాలు చేస్తాడని చెప్పేదాన్ని. ఎప్పుడైనా సమయం దొరికితే దేవుని వాక్యమే చెప్పేదాన్ని. సంఘంలో ప్రసంగం అయిపోగానే ఇంట్లో ఒక ప్రసంగం ఉండేది. బిడ్డా! దేవుడు గొప్ప కార్యములు చేయబోతున్నాడని చెప్పేదాన్ని. ఎప్పుడూ వారిలోని నెగెటివ్ క్వాలిటీస్ ఎత్తి చెప్పొద్దు. నేను వారిని సరి చేసి దేవునికి వదిలేస్తాను. అంతే, ఎప్పుడూ వారిలో దేవుని భయం జొప్పించి వారి జీవితాల్లో దేవుడు గొప్ప కార్యం చేస్తాడని విశ్వాసంతో చెబుతాను. తల్లిదండ్రులు పిల్లలకు ఇలా చెబుతుండాలి. కనిపెట్టుకొని ఉంటే దేవుడు తప్పకుండా నీ జీవితంలో నీ బిడ్డల జీవితంలో గొప్ప కార్యములు చేస్తాడు.

## 97. నేను మీకు ఖ్యాతిని మంచి పేరును తెప్పింతును - జెఫన్యా 3:20

**"ఆ కాలమున మీరు చూచుచుండగా నేను మిమ్మును చెరలోనుండి రప్పించి, మిమ్మును సమకూర్చిన తరువాత మిమ్మును నడిపింతును; నిజముగా భూమిమీద నున్న జనులందరి దృష్టికి నేను మీకు ఖ్యాతిని మంచి పేరును తెప్పింతును; ఇదే యెహోవా వాక్కు."** - జెఫన్యా 3:20

నీవు భూమిమీద నున్న జనులందరి దృష్టిలో ఖ్యాతి నొందుతావు. దేవుడు ఇంతవరకు నీకు ఉన్న చెడ్డపేరును కొట్టివేసి ఖ్యాతిని, మంచి పేరును అనుగ్రహిస్తాడు. ఇది దేవుడు తనతట్టు తిరిగిన తన బిడ్డలకు ఇచ్చిన వాగ్దానం. అందరూ మంచి పేరుకొరకు ప్రాకులాడుతుంటారు. మంచి పేరు నీకు అంత సులభంగా దొరకదు. మంచి పనులు చేస్తే మంచి పేరు వస్తుంది. చెడు పనులు చేస్తే వారికి మంచి పేరు రాదు చెడ్డపేరే వస్తుంది. కాని చెడుపనులు చేసేవాడు కూడా యేసుప్రభువును అంగీకరించి ప్రభువుతట్టు తిరిగి ప్రభువులో నిలిచి ప్రభువుద్వారా గొప్ప కార్యాలు చేస్తే ఆ చెడ్డపేరు కొట్టివేయబడి ఎక్కడెక్కడ నింద, అవమానం పొందాడో అక్కడంతా రెట్టింపు ఘనత అతనికి అనుగ్రహింపబడుతుంది. ఒక బందిపోటు దొంగ మారు మనస్సు పొంది జనుల మధ్యకు వచ్చి ఒకప్పుడు నేనొక బందిపోటు దొంగను దేవుడు నన్ను ఇప్పుడు పూర్తిగా మార్చివేశాడు దేవునికి స్తోత్రం! అని దేవునిగూర్చి చెబితే నీవు వినవా? తప్పకుండా వింటావు. ఎవడైనను క్రీస్తునందున్నయెడల వాడు నూతన సృష్టి, పాతవి గతించెను ఇదిగో సమస్తము నూతనమాయెను. అతని పాతపేరు కొట్టుకొని పోయింది. ఇప్పుడు క్రొత్తపేరు, క్రొత్త అనుభవం, క్రొత్త జీవం, క్రొత్త ఆశీర్వాదాలు, ఖ్యాతి పొందుతాడు. జిగటగల దొంగ ఊబినుండి మారుమనస్సు పొంది వాక్యం అనే బండమీద నిలబడుతాడు. యేసురక్తముచేత కడుగబడుతాడు. గనుక ఇక పాత పేరుతో అతనికి సంబంధము ఉండదు. ఖ్యాతి, మంచి పేరు అనేది దేవుడు నీకు అనుగ్రహిస్తాడు.

**"గొప్ప ఐశ్వర్యముకంటె మంచి పేరును వెండి బంగారములకంటె దయయు కోరదగినవి."** - సామెతలు 22:1

నీకు ఉన్న పేరును కాపాడుకోవడం కూడా చాలా గొప్పవిషయం. ప్రతి ఒక్కరి వ్యక్తిగత జీవితంలో వారికి ఒక పేరు ఉంటుంది. అలాగు ఒక సంఘానికి పేరు ఉంటుంది. హైదరాబాద్ పట్టణంలో **'యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్'**కి ఒక పేరు ఉంది. మంచి పేరుగల సంఘమే **"యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్" (యు.పి.ఎఫ్.)**. అనేకులు ఇక్కడికి నేర్చుకోవడానికి వస్తారు.

మీ ప్రోగ్రామ్స్ (కార్యక్రమాలు) ఏమిటి? మీరు సంఘమును, కూడికలను ఎలా నడిపిస్తారు? ఎందుకు ఇంత మంది జనాలు వస్తున్నారు? మీరు చేసే ప్రయత్నాలు ఏమిటి? మీరు ఏ విధంగా ప్రార్థనలు జరిగిస్తారు అని పెద్ద పెద్ద నాయకులు కూడా వచ్చి అడుగుతారు. ఈ పేరు మాకు ఇచ్చింది దేవుడే. నీవు దేవునిలో ఉంటేనే నీకు మంచి పేరు, ఖ్యాతిని అనుగ్రహిస్తాడు. దేవునికి వేరుగా, విరుద్ధంగా ఉంటే ఈ పేరు, ఘనత నీకు రాదు. దేవుని మాట విన్నవారికి దేవుడు తప్పకుండా మంచి పేరు అనుగ్రహిస్తాడు.

**"సుగంధతైలముకంటె మంచి పేరు మేలు."** - ప్రసంగి 7:1

ప్రతి విశ్వాసికి మంచి పేరు ఉండాలి. ఒకవేళ నీ పేరు పాడుచేయాలని శత్రువు ప్రయత్నించినా శత్రు ప్రయత్నాలన్నీ విఫలంచేసి దేవుడు నీ పేరును నిలుపుతాడు. సత్యం తప్పకుండా భూమినుండి మొలకెత్తుతుంది. నీవేమీ బాధపడనవసరం లేదు. కొందరు స్త్రీలు నా దగ్గరికి వచ్చి 'చూడండి సిస్టర్! ఫలానా వాళ్లు నా పేరంతా పాడుచేశారు' అని చెబుతారు. నీ పేరు పాడుచేయడం ఎవరితరం కాదు. ఎల్లప్పుడు సత్యమే గెలుస్తుంది. నీ మీదికి వచ్చే నిందలు, అవమానములు తాత్కాలికమైనవి. కావున నీకు ఉన్న పేరు అలాగే ఉంటుంది. నీవు ప్రభువులో ఉంటే చాలు. ప్రభువు ఆజ్ఞ మీరకుండా ప్రభువు మార్గాలు, కట్టడలు అనుసరించి దైవభయం కలిగి స్వచ్ఛమైన నిర్మలమైన మనస్సాక్షితో జీవించావంటే ఈ లోకంలో నీకు దేవుడు మంచి పేరు, ఖ్యాతినిస్తాడు. ఆ పేరు నీకు కావాలా? అయితే నీవు ప్రభువుతట్టు మరలాలి.

మనము ఎక్కడికైనా వెళ్లుటకు అంతా సిద్ధపడ్డాక మంచి సెంట్ పూసుకుంటాము. ఎందుకంటే మనం నడిచేటప్పుడు మంచివాసన రావాలని. అలా నీ హృదయం నిర్మలంగా పరిశుద్ధంగా ఉంచుకొని నీ మార్గములో నీవు వెళ్తున్నప్పుడు నీ జాడలు సారమును వెదజల్లాలి. ఇతను దేవుని బిడ్డ అని నిన్ను చూడగానే జనులు లేచి నిలబడుతారు. రాజులు నీకు నమస్కారము చేస్తారు. ప్రముఖ హాస్యనటుడు శ్రీ బాబుమోహన్‌గారు మంత్రి పదవిలో ఉండగా అతని కుమారుడు యాక్సిడెంట్‌లో చనిపోయినప్పుడు నేను ఆయనను చూడడానికి వెళ్లాను. అక్కడ విపరీతమైన జనాలు, రాజకీయ నాయకులు, మంత్రులు, ఆయనను ప్రేమించి గౌరవించేవారు తండోపతండాలుగా ఉన్నారు. డయాస్ (సభావేదిక) అంతా నిండిపోయింది. ఆయనను చూచుటకు, అక్కడ నిలబడుటకు కూడా వీలులేదు. నాకేమో సమయం లేదు. అక్కడే ప్రార్థిస్తే ప్రభువు ముందుకు వెళ్లు, నేను నీకన్నా ముందు వెళ్తున్నానని చెప్పాడు. నేను కిక్కిరిసిన జనంలోగుండా త్వరత్వరగా డయాస్ మీదికి వెళ్లిపోయాను. ఎవరూ నన్ను ఆపలేదు. నన్ను చూసి బాబుమోహన్ గారు వెంటనే కుర్చీలో నుంచి లేచారు. జనులందరి ముందు ఒక దైవజనురాలికి ఖ్యాతి లభించింది. అతను, అతని భార్య నా చెయ్యి పట్టుకొని ఏడుస్తున్నారు. 2 నిమిషాలు అక్కడ నిలబడి వారిని పరామర్శించి, ప్రార్థించి వచ్చాను. దేవుని పేరట నీవు ఎక్కడికి వెళ్తే అక్కడ దేవుడు నీకు గొప్ప జయం అనుగ్రహిస్తాడు. ఆయన నీకు ఖ్యాతిని మంచిపేరును అనుగ్రహిస్తాడు.

మంచి పేరు కలిగి ఉండడం చాలా ముఖ్యం. యథార్థముగా నడుచుకునేవారికి దేవుడు తప్పక మంచి పేరును ఇస్తాడు. అప్పుడు నీవు ఎక్కడికి వెళ్లినా నీకొరకు ద్వారాలు తెరచుకుంటాయి. మూయబడిన ద్వారములన్నీ తెరువబడుతాయి. కొందరు పేరుకొరకు పోస్టర్లు విజిటింగ్‌కార్డ్స్ ముద్రించుకుంటారు. రంగురంగులతో హంగామా చేస్తారు. కాని పేరు రాదు. మంచిపేరు అలా వచ్చేది కాదు. నీ నీతికి తగ్గట్టు ఆయన నీ గుడారపు స్థలాన్ని విస్తరిస్తాడు. అప్పుడు నీ ఖ్యాతి అంచెలంచెలుగా పెరిగిపోతుంది. పాపివైన నీకు పరిశుద్ధతను అలంకారంగా ధరింపజేసి నీపై ఉన్న నింద, అవమానాన్ని కొట్టివేస్తాడు. నీవు దేవుని వాక్యాన్ని హత్తుకొని బ్రతకాలి. దేవునిలో నిలిచి ఉండాలి. నేను నిజమైన ద్రాక్షావల్లిని, మీరు తీగెలు, నా తండ్రి వ్యవసాయకుడు. నాలో ఉండే ప్రతి తీగె బహుగా ఫలిస్తుంది అని యేసు ప్రభువు చెప్పాడు. వాక్యమనే నీరు కట్టి నిన్ను పెంచుతున్నాడు గనుక నీకు తప్పక మంచి పేరు ఇస్తాడు.

కొందరు వారి పేరు పాడైందని ఉరి పోసుకుంటారు. విషం మ్రింగుతారు. ఒకరు పేరు పాడైందని పురుగులమందు త్రాగానని చెప్పారు. నీవు ఇలా ఏ పురుగుమందు త్రాగనవసరం లేదు. ఏ ఉరికొయ్య ఎక్కనవసరం లేదు. మరే అఘాయిత్యానికి పాల్పడే అవసరం లేదు. దేవునిలో ఉంటే, నీ పాపం ఎంత ఘోరమైనదైనా దేవునిదగ్గర ఒప్పుకొని వదిలిపెడితే యేసుప్రభువు నిన్ను తన రక్తంతో కడిగి పరిశుద్ధపరచి గొప్ప భక్తునిగా తయారు చేస్తాడు. నింద అవమానం కొట్టివేసి నీకు ఘనత, మంచి పేరు, ఖ్యాతిని అనుగ్రహిస్తాడు.

## 98. నిన్ను తృణీకరించినవారందరు వచ్చి నీ పాదములమీద పడెదరు. - యెషయా 60:14

ఈ వాగ్దానము నీలో నెరవేరాలంటే ముందుగా దీనియొక్క షరతు నీవు తెలిసికోవాలి. **"నీకు వెలుగు వచ్చియున్నది, లెమ్ము, తేజరిల్లుము యెహోవా మహిమ నీమీద ఉదయించెను. చూడుము భూమిని చీకటి కమ్ముచున్నది కటికచీకటి జనములను కమ్ముచున్నది యెహోవా నీమీద ఉదయించుచున్నాడు. ఆయన మహిమ నీమీద కనబడుచున్నది."** - యెషయా 60:1,2

దేవుని మహిమ నీమీద కనబడుచున్నప్పుడు నీవు స్పందించాలి. దేవుని వెలుగు నీ దగ్గరికి వచ్చినప్పుడు నీవు లేవాలి లేచి ప్రభువుకొరకు ప్రకాశించాలి. దేవుని మాట వినగానే వెంటనే విధేయత చూపాలి, లోబడిపోవాలి. అప్పుడే నీవు యెషయా 60వ అధ్యాయంలోని శుభవాక్కులలో ఉన్న ఆశీర్వాదాలన్నీ పొందుతావు. నిన్ను తృణీకరించిన వారందరు వచ్చి నీ పాదములమీద పడతారు. ఇది దేవుని బిడ్డలకు చెందిన వాగ్దానం. దేవునిలో ఉండడం ఎంత గొప్ప విషయం. ఎంత హుందాతనం! ఎంత ధీమాయో చెప్పలేము. దేవునితో ఉంటే చాలు, దేవుని అంగీకరిస్తే చాలు దేవుని పిల్లలైపోయే అధికారం పొందవచ్చు. నీవు దేవునికి ప్రియబిడ్డగా ఉంటే నీ విరోధులందరు వచ్చి నీకు సాష్టాంగనమస్కారం చేస్తారు. నీ పగవారందరు అణగిపోతారు. నీవు దేవునికొరకు ప్రకాశిస్తుంటే ఒక రోజు వస్తుంది, అప్పుడు నిన్ను తృణీకరించినవారందరు వచ్చి నీ పాదములమీద పడతారు.

క్రైస్తవ జీవితం ఎంత శుభకరమైనది. ఎంత సౌభాగ్యంతో కూడినది. దేవుని వాగ్దానాలు నమ్మి పొందాలి. ఆ వాగ్దానములు ఎత్తిపట్టి ప్రార్థించాలి. అప్పుడు నీ జీవితంలో దైవాశీర్వాదములు కుమ్మరింపబడుతాయి. ఈ రోజు భారంతో ఉన్న నీకు శుభవార్త! బంధువులు నిన్ను వదిలేశారని, స్వంతవారు తృణీకరించారని నీవు భారంతో ఉంటే నీవు అలాగే దేవునిలో నీ నిరీక్షణ కలిగి ఉండు. ఒక రోజున వారే వచ్చి నీతో సమాధానపడతారు నీకు లొంగిపోతారు. నీ పాదములమీద పడి నిన్నే ప్రార్థన కోరుతారు. ఆ రోజులు దేవుడు తప్పకుండా నీకు అనుగ్రహిస్తాడు. ఫలానా వారు మిమ్మును ఎంతగా తృణీకరిస్తున్నారు. అస్సలు వారు మమ్మును లెక్కపెట్టడం లేదు. స్వంతవారే మమ్మును అసహ్యహించుకుంటున్నారు. నా స్వంతవారు నాకు శత్రువులై పోయారని ఆందోళన చెందుతున్నప్పుడు ఈ వాగ్దానం ఎత్తిపట్టి ప్రార్థించు. నన్ను తృణీకరించినవారే వచ్చి నన్ను క్షమాపణ అడిగే రోజులు నాకు అనుగ్రహించు. నీపై నాకు గొప్ప నిరీక్షణ, ఆశ అనుగ్రహించు. ఈ వాగ్దానం నెరవేర్పు నేను నా కన్నులారా చూడాలి. శత్రునింద, అవమానంనుండి నన్ను తప్పించి నీ రెక్కలతో నన్ను కప్పు అని ప్రార్థించు. దేవుడు తప్పక తన వాగ్దానము నీ యెడల నెరవేరుస్తాడు. ఆమేన్!. - సశేషం ❀

# దేవుని వెయ్యి ఆదేశములు

ధారావాహిక

గత సంచిక తరువాయి...

## 105. "యెరూషలేము కుమార్తెలారా, నా నిమిత్తము ఏడ్వకుడి; మీ నిమిత్తమును, మీ పిల్లల నిమిత్తమును ఏడ్వుడి." - లూకా 23:28

యేసుక్రీస్తు ప్రభువు సిలువ వేయబడక ముందు బరువైన సిలువను ఎత్తికొని పడుతూ, లేస్తూ, తొట్రిల్లుతూ, చాటబారుతో వీపు దున్నబడు తున్నప్పుడు యెరూషలేము కుమార్తెలు గుండెకొట్టుకొని ఏడుస్తూ విలపి స్తుంటే ఆ సమయంలో ప్రభువు పలికిన ప్రశస్తమైన ఆదేశమే ఇది. ఎప్పుడైతే ఒక వ్యక్తి హృదయవేదన, భారంతో కన్నీరు కారుస్తాడో అప్పుడు శరీరములో రుగ్మతలు, రోగాలు, టాక్సీన్స్ అన్నీ కన్నీటిద్వారా బయటికి వచ్చేస్తాయి. ఏడ్వడమనేది మహా విద్య. శాస్త్రజ్ఞులు ఈ కన్నీటిపై ఒక పరిశోధన జరిపారు. ఆనందబాష్పాలు కార్చే ఒకర్ని, బాధతో కన్నీరు కార్చే మరొకర్ని పరిశోధనకు తీసికున్నారు. ఆనందబాష్పాలు అంటే హృదయము సంతోషంతో ఉన్నప్పుడు కంటినుండి వచ్చే నీరు. వీరి కన్నీటిని, హృదయవేదనతో గుండెపగిలి విరిగినలిగి హృదయంతో ఏడుస్తు ఉండేవారి కన్నీటిని ఒక ఫిల్లర్‌తో సేకరించి రెండిటిని క్రూసిబుల్స్‌లో ఉంచి పరీక్షించారట. పరీక్షానంతరము వారు ఆనందబాష్పాలలో వారేమీ కనుగోలేదట కానీ హృదయ వేదన, బాధతో ఏడ్చినవారి కన్నీటిలో విషపదార్థాలు, టాక్సీన్స్ కనుగొన్నారట. వారి శరీరములోని విషపదార్థాలు 'టియర్ డక్ట్' ద్వారా బయటకు వస్తున్నాయని, ఇది శాస్త్రజ్ఞులు చెప్పిన విషయం కానీ కన్నీటి ప్రార్థన గురించి బైబిల్‌లో ఎన్నో చోట్ల రాయబడింది. **"నీవు కన్నీళ్లు విడుచుట చూచితిని; నీ ప్రార్థన నేనంగీకరించి యున్నాను; నేను నిన్ను బాగుచేసెదను,"** - 2 రాజుల 20:5. మన శరీరములోని రోగము, భయము, ఆందోళన, టాక్సీన్స్, విషపదార్థాలు కన్నీటి రూపంలో బయటకు వెళ్లిపోతాయి. కన్నీరు కార్చుడంద్వారా నీ బాధకు నివారణ దొరుకుతుంది. ఇందునిమిత్తమే కాబోలు యేసు ప్రభువు ముందుగానే మీ నిమిత్తము, మీ పిల్లల నిమిత్తము ఏడ్వమని చెబుతున్నాడు.

యేసు ప్రభువు సిలువను మోస్తూ పటుబాధలు పడుతున్నాడు. రాత్రంతా నిద్ర, ఆహారము, పానీయము లేదు. పిలాతు దగ్గరనుండి హేరోదు నొద్దకు, హేరోదు దగ్గరినుండి పిలాతునొద్దకు పంపబడుచున్నాడు. జనసమూహము దొమ్మిగా అతనిపై పడుతున్నారు. పిడిగుద్దులు గుద్దుతున్నారు. ఉమ్మివేస్తున్నారు. తలవెంట్రుకలు పట్టి లాగుతున్నారు. ఎంతో నిర్ధయగా ప్రవర్తిస్తున్నారు. బరువైన సిలువను మోపి కొరడాతో కొడుతున్నారు. దేహమునుండి రక్తము కారిపోతుంది. ఆ సమయంలో యెరూషలేము కుమార్తెలు రొమ్ముకొట్టుకొని ఏడుస్తున్నారు. అయ్యో! ప్రభువా, నీకు ఇన్ని బాధలా? అని దుఃఖిస్తున్నారు. బైబిల్‌లో ఒక స్త్రీ ఆయనను కొట్టినట్లు, తిట్టినట్లు, ఉమ్మివేసినట్లు, బాధించినట్లు ఎక్కడా లేదు. ఈ విషయం నాకు చాలా సంతోషాన్ని ఇస్తుంది. ప్రభువును శిక్షించిన నింద స్త్రీలపై లేదు. కావున తప్పక స్త్రీలు ప్రభువును సేవించాలి. మగ్దలేనే మరియ, సలోమి, ప్రభువు పాదాలు కడిగిన స్త్రీ, పాపాత్మురాలైన స్త్రీ, ప్రభువు క్షమించిన స్త్రీ వీరందరు ఏడుస్తుండగా వారితట్టు తిరిగి **'మీరు నా నిమిత్తము ఏడ్వకుడి. మీ నిమిత్తము, మీ పిల్లల నిమిత్తము ఏడ్వుడి'** అనే ఈ ఆదేశమును ప్రభువు వారికి ఇచ్చాడు.

"గొప్ప జనసమూహమును, ఆయననుగూర్చి రొమ్ముకొట్టుకొనుచు దుఃఖించుచున్న చాలమంది స్త్రీలును ఆయనను వెంబడించిరి. యేసు వారివైపు తిరిగి - యెరూషలేము కుమార్తెలారా, నా నిమిత్తము ఏడ్వకుడి; మీ నిమిత్తమును మీ పిల్లల నిమిత్తమును ఏడ్వుడి."

- లూకా 23:27, 28

ఎందుకు ఏడ్వాలి? అంటే **"ఇదిగో - గొడ్రాండ్రును కనని గర్భములును పాలియ్యని స్తనములును ధన్యములైనవని చెప్పుదినములు వచ్చుచున్నవి. అప్పుడు - మామీద పడుడని పర్వతములతోను, మమ్ము కప్పుడని కొండలతోను జనులు చెప్పసాగుదురు. వారు పచ్చిమ్రానుకే యీలాగు చేసినయెడల ఎండినదానికేమి చేయుదురో అని చెప్పెను."**

- లూకా 23:29-31

భయంకరమైన రోజులు రాబోతున్నాయని యేసు ప్రభువు ప్రవచనాత్మకంగా పలుకుతున్నాడు. కొందరు తల్లులిప్పుడే **'అస్సలు వీరిని ఎందుకు కన్నాము? వీరిని కని మాకేమి సంతోషము?** అని ఏడుస్తున్నారు. కనని గర్భములు, పాలియ్యని స్తనములు ధన్యములని దేవుడు ఆనాడు చెప్పాడు. కాని ఆ రోజులు ఈనాడు వచ్చేశాయి. ఏ తల్లికీ నెమ్మది ఉండడం లేదు. ఒక తల్లి నా దగ్గరికి వచ్చి 'యౌవనస్తురాలైన నా కుమార్తె మాట వినడం లేదు దారి తప్పిపోతోంది ఏం చేయాలి?' అని బోరున ఏడుస్తుంది. దీనికి నియమమేమిటి? అంటే మనకు ఒక్కటే ఆయుధం. **'కన్నీటి ప్రార్థన'**. యేసు ప్రభువు చెప్పిన గొప్ప ఆదేశం **'మీ పిల్లల నిమిత్తం ఏడ్వుడి'**.

కన్నీటి ప్రార్థన అందరికీ రాదు. ప్రభువును అడిగి పొందాలి. కన్నీటి ప్రార్థన చేసే తల్లులను దేవుడు దీవిస్తాడు. నా తల్లి నాకొరకు కన్నీటితో ప్రార్థించింది. నా తల్లి ధన్యురాలు. ఆమె చేసిన ప్రార్థన నన్ను ధన్యురాలినిగా చేసింది. ఆమె రాత్రి వేళల్లో లేచి నాకొరకు ఏడ్చి ప్రార్థించింది. ఒక వేళ సుఖభోగములయందు ఆనందించే స్త్రీకి, కన్నీటి ప్రార్థన విద్య తెలియని స్త్రీకి నేను పుట్టి ఉంటే ఈ రోజున భూమ్మీద కనబడేదాన్ని కాదు. కాని నా తల్లి ఎల్లవేళలా నాకొరకు ప్రార్థించింది. రాత్రి వేళల్లో నా పడక దగ్గర మోకాళ్లూని ప్రార్థించేది. ఆమె కనీళ్లు నా చేతులమీద పడే ఈనాడు ఈ చేతులతో ముట్టి ఎవరికి ప్రార్థించినా వారికి రోగనివారణ కలుగుతుంది. ఆ కన్నీటి ప్రార్థన నన్ను అనేకులకు ఆశీర్వాదకరంగా మార్చింది. అలాగే యేసయ్య ఆదేశం ప్రకారము అవిధేయులైన మీ పిల్లలకొరకు మీరు ఏడ్చి, ప్రార్థించాలి.

## 106. "మీరు విలువపెట్టి కొనబడినవారు గనుక మనుష్యులకు దాసులు కాకుడి."

- 1 కొరింథీ 7:23

నీవు నీ సొత్తుకాదు. నీకొక విలువ ఉంది. నీవు విలువపెట్టి కొనబడ్డావు. నీకు యేసుక్రీస్తు రక్తమంత విలువ ఉంది. యేసు ప్రభువు నీకొరకు ప్రాణము పెట్టాడు. నీవు అంత విలువగలవానివి. కావున మీరు మనుష్యులకు దాసులు కావద్దు. పౌలు ఈ విషయాన్ని చెప్పిన కాలంలో రోమా ప్రభుత్వంలో చాలా మంది దాసులు ఉండేవారు. రోమీయులు డబ్బులు పెట్టి దాసులను కొనుక్కునేవారు. ఆ దాసులచేత ఎంతో పని చేయించేవారు. వారికి సరియైన నిద్ర, ఆహారము ఉండేది కాదు. పైగా

వారికి ఇచ్చే బత్తెము చాలా తక్కువ. అంతేగాక వారిని పటు బాధలకు గురి చేసేవారు. కాని వారు యేసుప్రభువును అంగీకరించిన తర్వాత యేసుప్రభువే వారికి నిజమైన యజమానుడయ్యాడు. ఇక వారు యేసుతోనే సహవాసము కలిగి ఉండాలని పౌలు భక్తుడు బోధిస్తున్నాడు.

యేసు ప్రభువును అంగీకరించిన తర్వాత నీ యజమానుడు యేసయ్యే. పాపములో ఉన్నప్పుడు నీ యజమానుడు సాతాను. వాడు సినిమాకు వెళ్ళమంటే పరుగెత్తికొని పోయి క్యూలో నిలబడి ఆ రద్దీ వత్తిళ్లలో సంతోషము, సమాధానము కోల్పోయి సినిమా చూసి కన్నీళ్లతో తిరిగి వస్తావు. కొందరైతే ఒక రాత్రి ముందే వెళ్లి అక్కడే పడుకొని ఉదయం క్యూలో నిలబడి తొక్కిసలాటలో చనిపోయినవారుకూడ ఉన్నారు. వారు సాతానుకు దాసులై అది ఎక్కడికి ఈడ్చుకుపోతే అక్కడికి ఈడ్వ బడుతున్నారు. అది త్రాగమని చెబితే త్రాగుబోతులుగా మారుతున్నారు. ఒక చెడు వ్యక్తి ఎలా ప్రేరేపిస్తే అలాగు విధేయులైపోతున్నారు. కావున మనిషి చెప్పిన మాటలనుబట్టి నడుచుకోవద్దు. భార్య-'పొరుగువారు లంచము తెస్తున్నారు. లంచం తీసికొనుటకు నీకు తెలివేలేదు' అంటే ఆ భర్తకు రోషము పుట్టి వెళ్లి లంచం పుచ్చుకుని ఇంటికి తీసికొని వస్తాడు. దానివలన శాపమే వస్తుంది. ఒకరి రక్తపు సొమ్ము, చెమట సొమ్మును నీ ఇంటిలోనికి తెచ్చినప్పుడు వారి ఉసురు నీకు, నీ పిల్లలకు తగులుతుంది. ఒకవేళ భార్య చెప్పినట్టు లంచము పుచ్చుకుంటే నీ ఉద్యోగము పోయి నీ పిల్లలు, నీవు నిరాశ్రయులౌతారు. కావున స్త్రీలు 'లంచము వద్దు. ఆకుకూరల భోజనము, పచ్చడి మెతుకులే చాలు. అన్యాయపు సొమ్ము ఇంటికి తీసుకురావద్దు' అని మీ పురుషులతో చెప్పాలి. అప్పుడు నీ చేతుల కష్టార్జితమును నీవు అనుభవిస్తావు. నీకు దీవెన కలుగుతుంది. కావున నీవు అలాంటి మనుష్యులకు దాసుడవు కావద్దు.

**"లోబడుటకు దేనికి మిమ్మును మీరు దాసులుగా అప్పగించు కొందురో, అది చావునిమిత్తముగా పాపమునకే గాని, నీతి నిమిత్తముగా విధేయతకే గాని దేనికి మీరు లోబడుదురో దానికే దాసులగుదురని మీరెరుగరా? మీరు పాపమునకు దాసులై యుంటిరి గాని యే ఉపదేశక్రమమునకు మీరు అప్పగింపబడితిరో, దానికి హృదయ పూర్వకముగా లోబడినవారై, పాపమునుండి విమోచింపబడి నీతికి దాసులైతిరి."** - రోమా 6:16-18

**"ఈ స్వాతంత్ర్యము అనుగ్రహించి, క్రీస్తు మనలను స్వతంత్రులనుగా చేసియున్నాడు. కాబట్టి, మీరు స్థిరముగా నిలిచి మరల దాస్యమను కాడిక్రింద చిక్కుకొనకుడి."** - గలతీ 5:1

పాపము చేస్తే పాపమునకు బానిసవైపోతావు. అప్పుడు దేవుని దగ్గర ప్రార్థించుటకు ధైర్యము ఉండదు. పాపముంటే ఎటంటే అటు ఈడ్చుకుపో బడుతావు. పాపమువలన వచ్చు జీతము మరణము. దానివలన ఏ ప్రయోజనము ఉండదు. కావున నీవు పాపమునకు దాసుడవు కావద్దు. విలువపెట్టి కొనబడిన నీవు పాపమును ఎదిరించాలి. అణగద్రొక్కాలి. పరిశుద్ధంగా జీవిస్తూ దేవునికి దాసులై ఉండాలి. పాపమనే కాడిక్రింద చిక్కుకోవద్దు.

ఒక మనిషి-నీతి కార్యాలు చెయ్యొద్దు. ఆలయానికి వెళ్లొద్దు అంటే నీవు వానికి దాసుడవు కాకూడదు. నిన్నెవ్వరూ ఆపలేరు. నీవు స్వతంత్రంగా ఆలయానికి వచ్చేయాలి. ఒకరు నీతో అబద్ధమాడమని చెబితే నీవు వానికి కాక నీ యజమానుడైన యేసు మాట విని ఆయన మార్గములో నడుచుకుంటే యేసయ్యకే దాసుడవైపోతావు. అలాగున మనుష్యుల మాటలనుబట్టి నడువక దేవునికి విధేయులు కావాలి. ఎప్పుడైతే నీవు విలువపెట్టి కొనబడినవాడవని నీ రక్షణయొక్క విలువ తెలిసికుంటావో అప్పుడే దేవునికి దాసుడవైపోతావు. ఆయన బీజము నీలో ఉంది కాబట్టి పాపము ఉండదు. ప్రభువుతట్టు తిరిగి పాపము ఒప్పుకునేంతవరకు ఏ విశ్వాసికి కూడ నిద్రపట్టదు. వెంటనే యేసురక్తంతో కడగమని ప్రార్థించి ఆ దుర్నీతి తొలగించుకోవాలి. జంతువులన్నిటిలో గొఱ్ఱె చాలా పరిశుభ్రమైన, పవిత్రమైన జంతువు. గొఱ్ఱెమీద ఏదైనా పేడ, మురికి పడితే వెంటనే దులిపేసుకుంటుంది. దానినస్సలు సహించుకోలేదు. కావున విశ్వాసులను ఎక్కువగా గొఱ్ఱెలతో పోలుస్తారు. ఉదాహరణకు నీవొక పందిని తెచ్చి 10 సబ్బులు రుద్ది కడిగి శుభ్రము చేసి పౌడరు చల్లి, పరిమళ ద్రవ్యములు పూసి దాని మెడకొక రిబ్బను కట్టి వాకింగ్‌కు తీసుకెళ్తే అక్కడ గనక అదొక డ్రైనేజీని చూస్తే నీవు చేసిన ఉపకారములన్నీ మరచి, త్రాడు తెంచుకొని పరుగెత్తికొనిపోయి అందులోపడి దొర్లుతూ ఆనందిస్తుంది. ఎందుకంటే ఆ పాపము, ఆ మురికే దానికి ఇష్టము. నీవు దానిమీద ఎంత ఖర్చుపెట్టావు. ఎన్ని పాట్లు బడ్డావు. అన్నీ క్షణంలో మర్చిపోతుంది. మనము అలాంటి వారిలా ఉండొద్దు. యేసయ్య రక్తముతో కొనబడినవారము కాబట్టి పాపము చెయ్యొద్దు. మనుష్యులకు దాసులు కావద్దు. కొన్నిసార్లు మనుష్యులు నిన్ను పాపము చేయుటకు, దేవునికి అవిధేయులగుటకు ప్రేరేపిస్తారు. అట్టి ప్రేరణకు లొంగకూడదు. దేవుని మాటే వినాలి. యేసయ్యనే ఘనపరచాలి. నిన్ను తన రక్తము, ప్రాణము పెట్టి కొన్న దేవునికే దాసులు కావాలి.

## 107. "మీ అవయవములను నీతికి దాసులుగా అప్పగించుడి." - రోమా 6:19

నీవు నీతికి లోబడాలి. నీతికి దాసులు కావాలి. యేసు నీకు యజమానుడైతే ఆయన ఏమి చెప్పాడో అదే నీవు చేయాలి. అప్పుడు నీవు నీతికి దాసుడవైపోతావు.

**"మీ శరీర బలహీనతనుబట్టి మనుష్య రీతిగా మాటలాడుచున్నాను; ఏమనగా అక్రమము చేయుటకై, అపవిత్రతకును అక్రమమునకును మీ అవయవములను దాసులుగా ఏలాగు అప్పగించితిరో, ఆలాగే పరిశుద్ధత కలుగుటకై యిప్పుడు మీ అవయవములను నీతికి దాసులుగా అప్పగించుడి. మీరు పాపమునకు దాసులై యున్నప్పుడు నీతివిషయమై నిర్బంధము లేనివారై యుంటిరి. అప్పటి క్రియలవలన మీకేమి ఫలము కలిగెను? వాటినిగురించి మీరిప్పుడు సిగ్గుపడుచున్నారు కారా? వాటి అంతము మరణమే, అయినను ఇప్పుడు పాపమునుండి విమోచింపబడి దేవునికి దాసులైనందున పరిశుద్ధత కలుగుటయే మీకు ఫలము; దాని అంతము నిత్యజీవము."** - రోమా 6:19-22

నీకు కల్లు కొట్టుకు వెళ్ళాలని ప్రేరణ కలిగినా, పేకాట ఆడాలని శోధన వచ్చినా, టి.వి. ముందు కూర్చోవాలని వాంఛ కలిగినా, స్నేహితుల ఇల్లు తిరుగాలని తలంచినా వాటిని విడిచి నీవు నీతిమార్గాల్లో నడుచుకోవాలి. నా యజమానుడు చెప్పిన మాటల్లో నడుచుకుంటానని నిశ్చయించుకోవాలి. నీతి క్రియలు జరిగించుటకు నిన్ను నీవు సిద్ధపరచుకోవాలి. ప్రేమ, సంతోషం, సమాధానమనే ఆత్మఫలములు నీలో కనబడినపుడు నీవు నీతికి దాసుడవౌతావు. కీడు చేయమని ఇతరులు నిన్ను ప్రేరేపించినా, అబద్ధములు నీ నోటికి వచ్చినా నీవు వాటికి దాసుడవు కాక దానికి ఒప్పక నీతిక్రియలు జరిగించాలి. - సశేషం ✿

# దేవుడు చేసిన అద్భుతకార్యములు

**1. తేజ, ఆదోని, కర్నూలుజిల్లా:** నేను ప్రభువు నెరుగని కుటుంబంనుండి వచ్చాను. నా స్నేహితునిద్వారా చర్చికి వెళ్లి ప్రభువుని తెలిసికున్నాను. ఇంటర్మీడియట్ చదివేటప్పుడు బాప్తిస్మం తీసికున్నాను. బి.ఈడీ చదువు పూర్తయ్యేదాకా ప్రభువు సన్నిధిలో బాగానే ఉన్నాను. ఆ తర్వాత జీవితంలో శోధనలు అవమానాలు ఎదురయ్యాయి. నేను క్రుంగిపోయి దేవునికి అయిష్టమైన పనులు చేశాను. నేను ఎంతో సిద్ధపడి టీచరు ఉద్యోగానికి పరీక్ష వ్రాశాను. ఐనా నాకు ఉద్యోగం రాలేదు. నేను టీచర్ ఉద్యోగానికి పరీక్ష వ్రాసి మొదటి ర్యాంకు వచ్చినా సరే రిజర్వుడ్ రోస్టర్ పాయింట్ వలన ఉద్యోగం రాదని ప్రభుత్వంవారు చెప్పారు. అప్పుడు నేను కోర్టుకి వెళ్లాను. కోర్టు ఉద్యోగమివ్వాలని సిఫార్సు చేసినా అధికారులు కోర్టు ఆర్డరు ప్రకారం ఉద్యోగం రాదన్నారు.

ఒకరోజు రికమెండు కొరకు మినిస్టర్ ఇంటికి వెళ్లి వస్తుంటే నా సర్టిఫికెట్స్ పోయి ఏడుస్తుంటే టీ కొట్టునడిపే సహోదరిద్వారా నా సర్టిఫికెట్స్ దొరికాయి. ఒక రోజు సెక్రటేరియట్‌లో ఉన్న చర్చికి వెళ్లి దేవా, ఈ రోజు నాతో మాట్లాడు అని ప్రార్థించాను. ఆ రోజు దేవుడు దైవజనునితో జీవితం అనే వాక్యం ద్వారా నాతో మాట్లాడాడు. అప్పటి వరకు ఈ జీవితం వద్దనుకున్న నేను బలం పొందాను. తరచుగా ప్రార్థన చేసికోటానికి సెక్రటరియేట్‌కి వెళ్తుంటే ఒక సహోదరి యు.పి.ఎఫ్. ఆల్‌నైట్ ప్రేయర్‌కి వెళ్లి జాయ్ అమ్మగారితో ప్రార్థన చేయించుకో నీకు ఖచ్చితంగా ఉద్యోగము వస్తుందని చెప్పారు.

నేను 2016 జూన్ నెలలో జరిగిన సంపూర్ణ రాత్రి ప్రార్థనకి వచ్చి నా బాధలు అమ్మగారితో చెప్పితే అమ్మగారు నాకొరకు ప్రార్థించారు. అమ్మగారు వ్రాసిన పుస్తకాలు చదివాను. పక్షిరాజు అనే పుస్తకం విశ్వాసి ఎలా ఉండాలో నేర్పించింది. అప్పటినుండి 41 రోజులు ఉపవాసంతో ప్రభువు సన్నిధిలో ప్రార్థిస్తున్నాను. 18వ రోజు శుక్రవారం నీరసంగా ఉన్నా ఉపవాస ప్రార్థనకి వచ్చి అమ్మగారితో ప్రార్థన చేయించుకున్నాను. ఆ రోజు జ్వరంతో **"స్వస్థపరచు యెహోవా"** అనే నామము ధ్యానిస్తూ నిద్రపోయాను. అప్పుడు అమ్మగారు కలలోకి వచ్చి నా పడక చుట్టు తిరిగి వెళ్లారు. నాకు జ్వరంనుండి స్వస్థత లభించింది. ఎప్పుడైతే సంపూర్ణ రాత్రి ప్రార్థనతో పాటు యు.పి.ఎఫ్. సంఘంలో జరిగే ప్రతి కూడికలో పాల్గొని, నామముల పుస్తకంలోని 'దేవుడు అధికారుల పొగరు అణచువాడు, రాజు హృదయమును నీటి కాలువలవలె త్రిప్పువాడు, ప్రార్థన ఆలకించువాడు, అద్భుతములు చేయువాడు, దైవసేవకుని మాట రూఢీ పరచేవాడు అనే నామములు' 50, 25 సార్లు వ్రాశానో అప్పుడు ఉద్యోగం ఇవ్వమనిన అధికారులు ఉద్యోగం ఇచ్చారు.

మా కుటుంబంలో అమ్మ, అన్న, వదిన, అక్క ప్రార్థన చేసేవారు కాదు. ఇప్పుడు దేవుడు వారిని ప్రార్థనపరులుగా మార్చాడు. నిజానికి నా ఆత్మీయజీవితం మరియు కుటుంబంలో మార్పు వచ్చాకే దేవుడు నాకు ఉద్యోగం ఇచ్చాడు. దేవుడు నాకు మంచి ప్రభుత్వ ఉపాధ్యాయునిగా ఉద్యోగమిచ్చాడు. అందును బట్టి దేవునికి స్తోత్రములు. ప్రార్థించిన అమ్మగారికి మరియు సంఘస్తులకు హృదయపూర్వక కృతజ్ఞతలు.

**2. రాజాబాబు:** మేము 2013వ సంవత్సరంనుండి యు.పి.ఎఫ్.కు వస్తున్నాము. మా కుమారుడు ఎం.ఎస్. కొరకు యు.ఎస్. వెళ్లాలని ప్రాసెస్ స్టార్ట్ అయిన రోజు అమ్మగారితో ప్రార్థన చేయించుకొని వెళ్లాము. దేవుడు ప్రతి ఆటంకమును తొలగించి కాలేజి అప్లికేషన్, కాలేజి సీటు, లోన్, వీసా విషయంలో అద్భుత సహాయం చేశాడు. అమ్మగారు ప్రార్థించిన వెంటనే వీసా వచ్చింది. ఆగస్టు 2016లో యు.ఎస్. వెళ్లాడు. సంఘ ప్రార్థనద్వారా దేవుడు క్షేమకర ప్రయాణం అనుగ్రహించాడు. మరియు మా అమ్మ డిప్రెషన్‌లోకి వెళ్లినప్పుడు ఉదయకాల ప్రార్థనలో ఇద్దరిద్దరు కలిసి చేసిన ప్రార్థనద్వారా 2 రోజుల్లో బాగైంది. దేవునికి స్తోత్రములు. అమ్మగారికి వందనములు.

**3. వి. కరుణలత, విజయవాడ:** నాకు వివాహం కాకముందు ఆరోరా ఇంజనీరింగ్ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉన్నప్పటినుండి (2008) అక్కడగ్గర ఉంటూ యు.పి.ఎఫ్.కు వస్తున్నాను. యు.పి.ఎఫ్. మీటింగ్స్, సంపూర్ణరాత్రి ప్రార్థనకు హాజరయ్యేదాన్ని. అమ్మగారి ప్రసంగం అంటే చాలా ఇష్టం. నాకు వివాహం అయ్యాక యు.పి.ఎఫ్.కి రాలేదు. నాకు మొదటి డెలివరీ అప్పుడు నాలుగు రోజులు నొప్పులు వచ్చినవి. ఎంతో కష్టము, బాధ, వేదన అనుభవించాను. నార్మల్ డెలివరికి అనుకూలత లేనందున చివరికి ఆపరేషన్ చేశారు. అయితే రెండవ సారి ప్రెగ్నెంట్ అయినప్పుడు అక్క **"దేవుని నామములు"** చదివి దేవుని స్తుతించు, నేను అమ్మగారితో ప్రార్థన చేయిస్తానని చెప్పింది. నేను మొదటిసారి ఎంతో వేదన అనుభవించాను. మరియు మొదట బాబు గనుక ఈసారి పాప కావాలని అడిగాను. అయితే నేను చాలా బలహీనముగా ఉన్నాను. మరియు హెచ్‌బి 7% మాత్రమే ఉంది. షుగర్ కూడా వచ్చింది. దేవుని నామములు స్తుతించిన తర్వాత హెచ్.బి. 14% అయ్యింది. అన్ని రిపోర్ట్స్ నార్మల్‌గా వచ్చినవి. నేను హాస్పిటల్‌లో అడ్మిట్ అయ్యాక అక్క ఫోన్ చేసి అమ్మగారితో ప్రార్థన చేయించానని, అంతా బాగౌతుందని, పాప పుడుతుందని చెప్పింది. వారమంతా నామములు చదివి స్తుతించాను. స్తుతులు మా స్థితిగతులను మార్చినవి. సేఫ్ డెలివరీ అయ్యింది. పాప పుట్టింది. ఆపరేషన్ అయిన రెండవ రోజునే నేను లేచి ఏ నొప్పి, బాధలేకుండా ఉన్నాను. తర్వాత సులభంగా పనులన్నీ చేసికుంటున్నాను. మాకు ఏ సమస్య వచ్చినా నేను నా భర్త కలిసి దేవుని స్తుతిస్తాం. సమస్యలు తీరిపోతాయి. పాపకు 4 నెలలు ఉన్నప్పుడు మంచం మీదనుండి పడితే కాలర్ బోన్ ఫ్రాక్చర్ అయ్యింది. డాక్టర్స్ ట్రీట్‌మెంట్ చేయాలి. ఏదో బ్యాండ్ వేయాలన్నారు. నేను ట్రీట్‌మెంట్‌కు తీసుకువెళ్లే ముందు రాత్రి పాపను ఒళ్లోకూర్చోబెట్టుకొని 'దేవుని నామములు' స్తుతించాను. ఉదయం హాస్పిటల్‌కు వెళ్తే పాపకు ఫ్రాక్చర్ లేదని చెప్పారు. ఇప్పుడు (21.8.16 తేదీకి) పాపకు 1½ సంవత్సరాలు. అమ్మగారు పాపకు 'ఎస్తేర్ వర్షిణి' అని నామకరణం చేశారు. దేవునికి స్తోత్రములు. అమ్మగారికి వందనములు.

**4. సత్యవతి, పార్శిగుట్ట:** నేను ఆగస్టు 2016 మూడవ వారంలో మా కుమార్తెగూర్చి ప్రార్థించమని సంఘములో రిక్వెస్ట్ ఇచ్చాను. ఆమెకు గడ్డ అయ్యింది. బయాప్సీ పరీక్ష కొరకు క్యాన్సర్ హాస్పిటల్‌కు పంపారు. మేము చాలా భయపడ్డాం గానీ రిపోర్ట్సు అన్నీ నార్మల్‌గా వచ్చినవి. తర్వాత టి.బి. గడ్డ అని భయపడ్డాం. అదికూడా కాదని సంతోషిస్తున్నాం. పాప విషయమై దేవుడు చేసిన కార్యాన్నిబట్టి ఆమెకిచ్చిన ఆరోగ్యంబట్టి దేవుని స్తుతిస్తున్నాను. మరియు మా కుమారుడు కోయంబత్తూరులో పనిచేస్తాడు. దేవుని కృపనుబట్టి అతనికి అక్కడ 'గుడ్ అనలిస్ట్' అవార్డు వచ్చింది. యు.పి.ఎఫ్. సంఘానికి వచ్చాక ఎన్నో మేళ్లు పొందాను; దేవునిలో ఎంతో ఎదుగుతున్నాను. దేవునికి స్తోత్రములు. అమ్మగారికి వందనములు.

**5. హాజిమా, విద్యానగర్:** నేను 3.11.2015న యు.పి.ఎఫ్.కు వచ్చి నాకు మోకాళ్ల సమస్య ఉందని అమ్మగారితో ప్రార్థన చేయించుకొని వెళ్లాను. నా కుడి మోకాలు చాలా అరిగిపోయింది. అమ్మగారు ప్రార్థించాక బ్యాండేజ్ వేసికొని ఇంట్లోవాళ్లకు చెప్పాను. కొంచెం భయంగా ఉంది. మోకాళ్ల నొప్పి వలన క్రింద కూర్చోలేను. ఆ కారణంవల్ల 2016 ఏప్రిల్‌నుండి మందిరానికి కూడా రాలేదు. కాని విద్యానగర్‌లో ఉన్న యు.పి.ఎఫ్. ప్రేయర్ సెల్ ద్వారా ఎంతో ధైర్యం పొంది నడిపింపబడ్డాను. కాలి నరం, ఎముక ప్రతీది ఎంతో నొప్పిగా ఉండేది. 2016 జూలై లో హాస్పిటల్‌కు వెళ్తే అంతా నార్మల్‌గా ఉంది, ఏంలేదని డాక్టర్ చెప్పారు. దేవుడు నన్ను అద్భుతంగా స్వస్థపరచాడు. 1.8.2016 నుండి మందిరానికి వస్తున్నాను. ఏ నొప్పిలేదు. చక్కగా నడుస్తున్నాను. క్రింద కూర్చుంటున్నాను. దేవునికి స్తోత్రములు. అమ్మగారికి వందనములు.

**6. జ్ఞానమ్మ:** మేము 17 సంవత్సరాలుగా చర్చికి వస్తున్నాము. అమ్మగారు చెప్పినట్లు నేను, మా పిల్లలు ఉదయం 4 గంటలకు లేచి ప్రార్థిస్తాము. ఉదయం 4 లేదా 5 గంటలకు మందిరానికి వచ్చి సొంత గృహంకొరకు ప్రార్థించాము. మేము కిరాయి ఇంట్లో ఉండేవారిమి. దేవుడు అద్భుతముగా మాకు స్వంత గృహము ఇచ్చాడు. 01.09.2016న స్వంత గృహంలోకి మారాము. జూలై 2016న మా కుమారునికి జాబ్ రావాలని మందిరంలో ప్రేయర్ రిక్వెస్ట్ ఇచ్చాము. దేవుడు మా కుమారునికి ఉద్యోగం ఇచ్చాడు. మరియు 2016 జూలై లో నాకు చాలా అనారోగ్యత ఉంటే అమ్మగారితో చెప్పినప్పుడు అమ్మగారు ప్రార్థించి పండ్లు, ప్రార్థన నూనె ఇచ్చారు. నేను ఉదయం మందిరానికి వచ్చి మొక్కిపెట్టాను. దేవుడు నన్ను స్వస్థపరచి సాక్షిగా ఉంచాడు. రిపోర్ట్సు అన్నీ నార్మల్‌గా వచ్చాయి. సంఘము ద్వారా ఇలాంటి ఎన్నో మేలులు పొందాను. దేవునికి స్తోత్రములు. అమ్మగారికి వందనములు.

**7. డా॥ షారన్ ప్రేమ్‌కుమార్:** అమ్మగారు నా వివాహ విషయమై ఎంతగానో ప్రార్థించారు. దేవుడు నా మార్గములు సరాళము చేశాడు. 2014లో నా వివాహం జరిగింది. ఫిబ్రవరి 2015లో మిస్ క్యారేజ్ అయ్యింది. ఎంతో బాధపడ్డాను. బాధ తట్టుకోలేక ఎంతో కుమిలిపోయి ఉన్నాను. జూలై 2015లో అమ్మగారి దగ్గరికి వచ్చినప్పుడు అమ్మగారికి ఏమీ చెప్పలేదు గాని అమ్మగారే పిలిచి కడుపుపై నూనె రాచి గర్భఫలము కొరకు ప్రార్థన చేశారు. ఆగస్ట్ 2015లో ప్రెగ్నెన్సీ టెస్ట్ చేస్తే పాజిటివ్ వచ్చింది. నేను డెంటిస్ట్‌ని. ఉద్యోగరీత్యా రోజూ చాలా దూరం ప్రయాణము చేయాలి. దేవుని ప్రార్థించి ప్రతిరోజు 70 కి.మీ. ప్రయాణిస్తున్నాను. నాకు అన్ని పరీక్షలు అయినవి. 7వ నెల వచ్చినా రెస్ట్ తీసికోకుండా దూర ప్రయాణం చేసి ఉద్యోగానికి వెళ్లాను. 9 నెలలు దాటాక అకస్మాత్తుగా నొప్పులు వస్తే హాస్పిటల్‌కు వెళ్లాము. ఫేక్ ఫెయిన్స్ అని పరీక్షలన్నీ చేసి డ్యూడేట్‌కి ఇంకా సమయం ఉంది కాబట్టి తర్వాత రమ్మన్నారు. డిశ్చార్జ్ అయిన మరుసటి రోజు 5 గంటలకు నొప్పులు వచ్చాయి. డాక్టర్స్ పరీక్షలన్నీ చేసి ఫీటస్ (బేబి) హార్ట్‌బీట్ తక్కువ ఉంది గనుక సి-సెక్షన్ చేయాలన్నారు. ఒక్క నిమిషం కూడా వెయిట్ చెయ్యొద్దు చాలా ప్రమాదం అని చెప్పారు. మేము ఏ పనినైనా ప్రారంభించే ముందు అమ్మగారిని సంప్రదించి ప్రార్థన చేయించుకొంటాము. ఆ సమయంలో ఫోన్ చేస్తే అమ్మగారు ఉదయం 7 గంటలకు సిలువ ధ్యానాలలో' సర్వీస్‌లో ఉన్నారు. తర్వాత అమ్మగారే మాకు ఫోన్‌చేశారు. అప్పుడు విషయమంతా చెప్పాను. అమ్మగారు 'ఎందుకు టెన్షన్? నొప్పులు భరించలేక అందరూ సి-సెక్షన్ చేయించుకుంటున్నారు.' అని ధైర్యం చెప్పి సేఫ్ డెలివరీ కొరకు ప్రార్థించారు. నన్ను ఆపరేషన్ థియేటర్‌కు తీసుకెళ్లి సి-సెక్షన్ చేశారు. డాక్టర్స్ బేబీ హార్ట్ బీట్ రేటు తక్కువౌతుంది. డెలివరీ అయ్యాక కాంప్లికేషన్‌నిబట్టి బేబీని వేరే హాస్పిటల్‌లో ఉంచాలి. మీరు ఇక్కడ ఉండాలి. డెలివరీ తర్వాత పిడియాట్రిక్ టెస్ట్సు అన్నీ ఓ.కే. అయితే తల్లి దగ్గర ఉండొచ్చని ముందుగానే చెప్పారు. నేను ప్రెగ్నెంట్‌గా ఉన్నప్పటినుండి ఒక మగబిడ్డనివ్వు అని దేవుని ప్రార్థించాను. నా తల్లి సునీలత అల్పైట్‌లో, సిస్టర్స్ అల్పైట్‌లో ఇతర కూడికల్లో పాల్గొని నా గురించి ప్రార్థించింది. నా తల్లి అల్పైట్ ప్రార్థనలకు వెళ్తున్నప్పటినుండి దేవుడు మా కుటుంబంలో ఎన్నో మేలులు జరిగించాడు. అమ్మగారు మా కుటుంబంపట్ల ఎంతో శ్రద్ధ చూపి మా కొరకు ప్రత్యేకంగా ప్రార్థించారు. మేము యు.పి.ఎఫ్.ని మరచిపోయినా అమ్మగారు మమ్మల్ని మరచిపోలేదు. నా వివాహమై నా భర్త ఇంటికి వెళ్లాక ఎప్పుడూ నా గురించి నా తల్లిని అడిగేవారు. దేవుని కృప అమ్మగారి ప్రార్థనవలన సేఫ్ డెలివరీ జరిగింది. నేను కోరినట్టు దేవుడు కుమారుని అనుగ్రహించాడు. డాక్టర్స్ చెప్పినట్లు కాక దేవుడు అన్నీ తన స్వాధీన మందుంచుకొని సమస్య లేనందున తల్లీ బిడ్డలు ఒకేదగ్గర ఉండుటకు కృప చూపాడు. 5 రోజులకు డిశ్చార్జ్ అయ్యాము. బాబు తక్కువ బరువుతో పుట్టినందున చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. పిడియాట్రిస్ట్ జాండీస్ ఉన్నాయని అడ్మిట్ చేసి ట్రీట్‌మెంట్ ఇచ్చి డిశ్చార్జ్ చేశారు. బరువు తక్కువ ఉన్నందున కొంచెం జ్వరం, జలుబు ఉన్నా కష్టము (బరువు పెరిగే వరకు) అని చెప్పినందున నేను చాలా భయపడ్డాను. ఒక రోజు బాబు ఒళ్లు కొంచెం వేడిగా ఉంటే అమ్మగారికి కాల్ చేశాను. అమ్మగారు 'నీవు అస్సలు నెగటివ్ థాట్స్ పెట్టుకోవద్దు. హి ఈజ్ వెరీ హెల్దీ బాయ్'. నీ మైండ్‌లోనుండి నెగటీవ్ థాట్స్ తీసేయాలని హెచ్చరించి బాబుకొరకు ప్రార్థన చేశారు. డాక్టర్ దగ్గరికి తీసికెళ్తే అన్నీ ఓ.కే అన్నారు. జ్వరం, జలుబు ఏమీలేదు. ఇప్పుడు ఎంతో ఆరోగ్యంగా ఉన్నాడు. 28.8.2016న అమ్మగారు మా బాబుకు 'ఇషాన్ సమర్పణ్' అని నామకరణం చేశారు. దేవునికి స్తోత్రములు. అమ్మగారికి వందనములు.

**8. నవీన, W/o. నవీన్:** మాకు ఒక బాబు పుట్టి సంవత్సరం వయస్సులో చనిపోయాడు. మా అక్క నన్ను యు.పి.ఎఫ్. మందిరానికి అమ్మగారితో ప్రార్థన చేయించుటకు తెచ్చింది. అమ్మగారు మాకు ప్రార్థన చేసిన నెల తర్వాత నేను ప్రెగ్నెంట్ అని తెలిసింది. అమ్మగారు నేను చాలా బలహీనంగా ఉన్నానని ప్రతినెల ఆర్థిక సహాయం చేశారు. అమ్మగారి ప్రార్థన, సహాయం దేవుని కృపవలన ఆరోగ్యకరమైన అందమైన కుమారుడు జన్మించాడు. ఆ బాబును సేవకు సమర్పిస్తున్నాం. 28.8.2016న అమ్మగారు మా బాబుకు 'జాషువ' అని నామకరణం చేశారు. దేవునికి స్తోత్రములు. అమ్మగారికి వందనములు.

**9. సుజాత వెంకట్:** దేవుడు నాకు అనేక విషయాల్లో ఎంతగానో మేలు చేశాడు. వివాహము, భర్త, పాప విషయంలో ఎంతో కాపాడాడు. పాప పుట్టి పుట్టింట్లో ఉన్నప్పుడు మా అత్తగారు నన్ను తీసికొని వెళ్లడానికి వచ్చినప్పుడు నేను ఇంకా 4 రోజులు ఉంటాననంటే నా భర్త నన్ను కొట్టాడు. ప్రార్థించినప్పుడు **'నీవు అగ్ని మధ్యను నడచునప్పుడు కాలిపోవు, జ్వాలలు నిన్ను కాల్చవు'** - యెషయా 43:2 అనే వాగ్దానము వచ్చింది. పాపకు 3 నెలల వయస్సు ఉన్నప్పుడు అమ్మగారి దగ్గరికి వచ్చి సమస్యలు చెబితే 'నీ భర్త తాగుతాడా?' అని అడిగి ప్రార్థించారు. అమ్మగారి ప్రార్థనవలన నా సమస్యల్లో దేవుడు సహాయం చేసి నెమ్మది నిచ్చాడు. మరియు దేవుని కృప, అమ్మగారి ప్రార్థనలవలన ఇప్పుడు నా భర్త త్రాగడము లేదు. నన్ను మందిరమునకు కూడా తీసికొనివచ్చాడు. దేవునికి స్తోత్రములు. అమ్మగారికి వందనములు.

**10. మృదుల శ్రీకాంత్, తార్నాక:** మాకు 2008వ సంవత్సరంలో వివాహము జరిగింది. నేను అప్పటినుండి యు.పి.ఎఫ్.కి వస్తూ ఎన్నో మేలులు, అద్భుతాలు పొందాను. నేను ఇంజనీరింగ్ చేశాను. గాని నాకు జాబ్ లేదు. యు.పి.ఎఫ్. మందిరములో కూర్చొని ఏడ్చాను. (కన్నీటితో ప్రార్థించాను) 3 నెలల్లో దేవుడు గొప్ప కార్యము చేశాడు. ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ ఇంజనీర్‌గా జాబ్ వచ్చింది. మరియు మా వివాహమై మూడున్నర సంవత్సరాలైనా మాకు పిల్లలు లేరు. అప్పుడుకూడా యు.పి.ఎఫ్. మందిరములో కూర్చొని ఏడ్చాను. దేవుడు నా గర్భము తెరచి కుమారుని అనుగ్రహించాడు. తర్వాత పాప కావాలని ప్రార్థించాను. అమ్మగారు ప్రార్థన చేసి పాపే పుడుతుంది అని చెప్పారు. దేవుడు ఆశగల ప్రాణమును తృప్తిపరచువాడు (కీర్తన 107:9) మంచి కాపరి దొరుకుట అరుదు అమ్మగారి మార్గదర్శకంలో నడవడం ఎంతో సంతోషకరంగా ఉంది. దేవుడు అమ్మగారి ప్రార్థన ఆలకించి తన మాటను రూఢీపరచి ఆరోగ్యకరమైన అందమైన కుమార్తెను అనుగ్రహించాడు. 03.09.2016న అమ్మగారు పాపకు **'రిధీమా ఔన్నత్య'** అని నామకరణం చేశారు. దేవునికి స్తోత్రములు. అమ్మగారికి వందనములు.

**11. జవహర్‌సింగ్, నాగారం:** నేను అన్య కుటుంబమునుండి వచ్చినవాడిని. 25.12.2002 క్రిస్మస్ రోజున ఫ్రెండ్స్‌తో కలసి ఫారెన్ రెస్టారెంట్‌లో త్రాగుదామని ఎంజాయ్ చేయడానికి వెళ్తూ ఎందుకు క్రైస్తవులు ఈ విధంగా గుంపుకూడుతారు, ఏమి చేస్తారని మార్గం మధ్యలో ఉన్న జి.ఎన్.గార్డెన్, గంగపుత్ర కాలనీకి వెళ్లాను. అందులో అప్పుడు అమ్మగారు ఒక పాపి మారడమే నిజమైన క్రిస్మస్. పాపులకొరకు యేసు క్రీస్తు జన్మించాడు అని చెబుతున్నారు. కొన్ని నిమిషాలు ఉండి వెళ్లిపోవలసిన వాడిని 3 గంటలు అక్కడే ఉన్నాను. ఫ్రెండ్స్‌తో త్రాగుటకు వెళ్లవలసిన నేను ప్రభువా! నీవే అయితే ఈ పాపిని రక్షించు, మారుమనస్సు దయచేయి' అని ప్రార్థిస్తున్నాను. అప్పుడు వాలంటీర్ ఒక కార్డ్ ఇచ్చాడు. **"అతడు నన్ను ప్రేమించుచున్నాడు గనుక నేనతని తప్పించెదను."** – కీర్తన 91:14 అని వచ్చింది. అతనితో నడుస్తూ వెళ్లిపోతుండగా అమ్మగారు బాబు ఇటురా అని నన్ను పిలిచి క్రొత్తగా వచ్చావా? ఇది దేవుడు ఇచ్చిన వాగ్దానము. ప్రభువు నిన్ను దీవిస్తాడు అని చెప్పి ఇది మొదలుకొని అన్ని విషయాలో దేవుడు నిన్ను తప్పిస్తాడు. ఈ వాగ్దానము పట్టుకొని ప్రార్థించు. దేవుడు నీపట్ల గొప్ప కార్యాలు చేస్తాడు అని చెప్పి ప్రార్థించారు. స్నేహితులు నాకు కాల్స్ చేస్తున్నారు. దేవుని ఆత్మ 'వద్దు', ఇంటికి వెళ్లిపో అని చెబుతున్నాడు. నేను అక్కడినుండి నేరుగా యు.పి.ఎఫ్. మందిరములోకి వచ్చి ప్రార్థించాను. ఇది మొదలుకొని నీ కుమారునిగా చేసికో అని దేవుని అడిగాను. అప్పటినుండి చర్చికి వస్తున్నాను. కాని నా చేతిలో బైబిల్ లేదు. అమ్మగారు పిలిచి బైబిల్ ఇచ్చి 'బిడ్డా! ఈ బైబిల్ చదువు. దేవుడు అద్భుతరీతిగా ఆశీర్వదిస్తాడు. నిన్ను వాడుకుంటాడు.' అని చెప్పి ప్రార్థించారు. అది తెలుగు బైబిల్. నాకు తెలుగు చదవడం రాదు. హిందీ చదువుతాను. గనుక ఆ బైబిల్ మందిరంలో పెట్టేస్తుండగా అమ్మగారు మళ్లీ పిలిచి విద్యలేని పామరులను దేవుడు వాడుకుంటాడు. నీవు ఎంత? అని గద్దించారు. అమ్మగారు తలమీద నూనెపోసి నీ మాటలు ఇతని నోట ఉంచి నీ చేతినీడతో కప్పు, వాక్యంతో పెంచు అని ప్రార్థించారు. అప్పటి నుండి తెలుగు నా గురి అయ్యింది. ఇప్పుడు తెలుగు చదువుతున్నాను. తెలుగులో బోధిస్తున్నాను. యేసు క్రీస్తును అంగీకరించినందున నన్ను ఇంట్లోనుండి వెలివేశారు. ఏడుస్తుంటే ప్రభువు – నేను నీకంటే ఎక్కువ దెబ్బలు తిన్నాను. మౌనంగా ఉంటే భూదిగంతములవరకు సాక్షిగా నిలబడతావు అని చెప్పాడు. దేవుడు నాపట్ల చాలా గొప్ప కార్యాలు చేశాడు. సూర్యపేట, పాతర్లపాడుకు చెందిన ఒక సేవకుడు పాస్టర్ శాంతయ్య తన కుమార్తెనిచ్చి నాకు పెళ్లి చేశాడు. లోకంలో ఎక్కడో కొట్టుకుపోతుంటే అమ్మగారి ద్వారా ప్రభువు ఈ విధంగా తన కృప నామీద ఉంచి నన్ను రక్షించుకున్నాడు. **'అమ్మ మాటలు'** అనే పుస్తకం నా హృదయాన్ని కదిలించింది. రేచల్ అమ్మ ఎలా అమ్మగారిని నడిపించారో అలా నాకు బోధించు, ధర్మశాస్త్రం నాకు చెప్పు అని దేవుని ప్రార్థిస్తే దేవుడు సహాయం చేశాడు. ఇప్పుడు నేను తెలుగులో బోధిస్తున్నాను. దేవునికి స్తోత్రములు. నా కొరకు ప్రార్థించి, ప్రోత్సహించి రక్షణలో నడిపించిన అమ్మగారికి వందనములు.

**12. ఎం. తనూజ:** 1.5.2016న దేవుడు నాకు ఆరోగ్యకరమైన చక్కని కుమారుని అనుగ్రహించాడు. అమ్మగారు ఆ కుమారునికి 'తేజస్‌పాల్' అని నామకరణం చేశారు. నేను 2016 మే నుండి 2016 అక్టోబర్ వరకు మెటర్నిటీ లీవ్‌లో ఉన్నాను. మాకు ముందు ఒక అమ్మాయి తర్వాత అబ్బాయి. ఇద్దర్నీ చూసుకోవడం చాలా కష్టంగా ఉందని, ఇంటికి దగ్గర ట్రాన్స్‌ఫర్ అయితే బాగుంటుంది కదా అని అమ్మగారిని ప్రేయర్ చేయమని అడిగాను. అమ్మగారు ప్రార్థన చేశారు. దేవుడు గొప్ప కార్యం చేశాడు. 15 నిమిషాల్లో ఆఫీసుకు వెళ్లేంత దగ్గరికి ట్రాన్స్‌ఫర్ అయ్యింది. ఒకసారి నేను ఉంటున్న ఇంటిపై ఒక వ్యక్తి అటాక్ చేశాడు. అమ్మగారి ప్రార్థనద్వారా ఆ సమస్య కూడా తీరిపోయింది. దేవుని కృపద్వారా ఆఫీస్‌కి రెండు నిమిషాల్లో వెళ్లే విధంగా క్వార్టర్స్ శాంక్షన్ అయింది. పిల్లల్ని చూసుకోవడం ఇంకా సులభం అయ్యింది. మరియు ఒకసారి బాబుకు డెంగ్యూ అటాక్ అయ్యింది. అమ్మగారి ప్రార్థన ద్వారా సంపూర్ణంగా తగ్గిపోయింది. దేవునికి స్తోత్రములు. మా కొరకు ఎంతగానో ప్రార్థించిన అమ్మగారికి వందనములు.

**13. వి.ఎల్.మేరి ఆనంద్:** మేము 2004 నుండి యు.పి.ఎఫ్.కు వస్తున్నాము. నా భర్త చనిపోయినప్పుడు నేను ప్రార్థన గోపురంలో ప్రార్థనా పరురాలిగా ఉన్నాను. ప్రార్థన గోపురానికి రావడం మానివేసినప్పటినుండి ఆరోగ్యం బాగుండడం లేదు. 15.7.2016 నుండి 3.8.2016 వరకు చాలా అనారోగ్యత కలిగింది. మొదట జ్వరం తర్వాత తీవ్రమైన దగ్గు, జలుబు, ఆయాసంతో ఎంతో బాధపడ్డాను. ఊపిరి తీసికోవడం ఎంతో కష్టంగా ఉంది. మందులు వేసికోవడంవలన మత్తుగా ఉండి మందిరానికి రావడం, ప్రార్థన చేసికోవడం తగ్గిపోయింది. ఒక రోజు యు.పి.ఎఫ్. మందిరానికి వచ్చి అమ్మగారితో ప్రార్థన చేయించుకొన్నప్పుడు వెంటనే నాలోకి ఏదో శక్తి వచ్చినట్టు అయి అద్భుతమైన స్వస్థత కలిగింది. శీఘ్రస్వస్థత నిచ్చిన దేవునికి స్తోత్రములు. అమ్మగారికి వందనములు.

**14. మేరి చంద్రపాల్, రాంనగర్:** మా కుమార్తె ప్రియదర్శిని వివాహము కొరకు అమ్మగారు, సంఘము ప్రార్థించారు. నేను కూడా తల్లీ–కుమార్తెల సహవాసంలో ఆమెకొరకు అందరితో కలిసి ప్రార్థన చేశాను. దేవుడు మా మార్గములు సరాళము చేశాడు. మంచి వివాహ సంబంధము అనుగ్రహించాడు. 2016 ఆగస్టులో ఆమె వివాహము ఘనంగా జరిగింది. అమ్మగారు, సేవకులు, ప్రార్థన వీరులు, సంఘ ప్రార్థనద్వారా దేవుడు ఈ గొప్ప కార్యము జరిగించాడు. వివాహము ముందురోజు అమ్మగారు మా కుమార్తె వివాహము మంగళకరంగా జరగాలని ప్రార్థించారు. దేవుడు తన సేవకురాలి మాట రూఢీపరచి విజయవాడలో వివాహం మంగళకరంగా జరిగించాడు. దేవునికి స్తోత్రములు. అమ్మగారికి వందనములు.

**15. హెప్సి రాజు:** మా కుమార్తె 5 నెలల గర్భిణిగా ఉన్నప్పుడు అమ్మగారి దగ్గరికి వెళ్లి ప్రార్థన చేయించుకుంది. ఆమె 9 నెలలు గర్భముతో వున్నప్పుడు నేను నార్మల్ డెలివరికొరకు సంఘములో ప్రార్థన చేయించాను. 9 నెలలు నిండాక డాక్టర్లు ఆపరేషన్ చేయాలి అని అన్నారు. నేను బిడ్డను బాగుచేస్తే, సాక్ష్యం చెబుతానని ప్రార్థన చేసికున్నాను. దేవుడు గొప్ప కార్యం చేశాడు.

డాక్టర్స్ మాటలు కొట్టివేసి నార్మల్ డెలివరి అనుగ్రహించాడు. తల్లీబిడ్డలకు క్షేమస్థితినిచ్చిన దేవునికి స్తోత్రములు. అమ్మగారికి, సంఘమునకు వందనములు.

**16. స్వయం ప్రభ రవీందర్, యూసఫ్‌గూడ:** నా భర్త రవీందర్‌కు రెండు కిడ్నీలు ఫెయిల్ అయి 4 సంవత్సరాలు అవుతుంది. 2 కిడ్నీల్లో రాళ్లు ఉన్నాయి. హార్ట్ ప్రాబ్లంవలన 3 సార్లు స్ట్రోక్ వచ్చింది. మళ్లీ ట్యూమర్ వచ్చింది. డాక్టర్స్ గ్యారంటీ ఇవ్వము అన్నారు. యు.పి.ఎఫ్. సంఘ సభ్యుడైన ఒక సహోదరుడు దెబోరాస్వరం పత్రిక ఇచ్చాడు. **'జీవపు మాటలు'** టి.వి. కార్యక్రమము సమయములు తెలియజేశాడు. టి.వి.లో వాక్యం పెట్టుకొని చూసి ఉదయం 3 గంటలకు లేచి ప్రార్థించాను. **'దేవుని నామములు'** పుస్తకము చదువుటవలన టి.వి.లో అమ్మగారి వాక్యం వినుటవలన నా భర్త స్వస్థత పొందాడు. అమ్మగారు టి.వి.లో ప్రార్థించగా ట్యూమర్ పోయింది. నా భర్త కోసం ఎంతో కష్టపడ్డాను. నా సమస్య దేవునికే అప్పగించుకొన్నాను. ఈ సమస్యల్లో నేనెందుకు బ్రతుకుతున్నాను అనుకున్నాను. కాని యు.పి.ఎఫ్. సహోదరుడు ఎంతో ధైర్యం చెప్పాడు. 2016 జనవరిలో నా భర్త బ్రతకడని అందరూ వచ్చి చూసి వెళ్తున్నారు. నేను దేవుని వద్ద ఎంతో ఏడ్చాను. దేవుడు కృప చూపి నా భర్తను సజీవుల లెక్కలో ఉంచాడు. దేవునికి స్తోత్రములు. అమ్మగారికి వందనములు.

**17. జాన్, రాంనగర్:** నేను 9 సంవత్సరాలుగా యు.పి.ఎఫ్.లో స్టాఫ్‌గా పనిచేస్తున్నాను. అమ్మగారి ప్రార్థనద్వారా దేవుని నుండి అనేక ఆశీర్వాదములు పొందాను. నేను 2016 జూలై మొదటివారం చెవిలో నొప్పి వచ్చి ఎంతో బాధపడ్డాను. డాక్టర్ ఇన్ఫెక్షన్ అని మెడిసిన్ ఇచ్చారు. నా ముఖంలో ఏదో మార్పు కనబడుతుంది. అమ్మగారు గుర్తుపట్టి చెవినొప్పిని గూర్చి జాగ్రత్తలు చెప్పి మరో డాక్టర్ దగ్గరకు వెళ్లమన్నారు. డాక్టర్ దగ్గరికి వెళ్లినప్పుడు అమ్మగారు ఏ జాగ్రత్తలైతే చెప్పారో అతనూ అవే చెప్పాడు. ప్రాబ్లం ఉంది అని చెప్పాడు. బాగా వాపు వచ్చింది. అనంతరం మాట్లాడం కష్టమైపోయింది. కంటి రెప్ప కొట్టుకోవటం లేదు. కళ్లలో మంట. నవ్వడం రావడం లేదు. అప్పుడు మళ్లీ అమ్మగారితో ప్రార్థన చేయించుకున్నాను. అమ్మగారు **'దైవికస్వస్థత'** పుస్తకం చదవమని చెప్పారు. ప్రార్థన నూనె ముఖానికి రాసుకోమన్నారు. ప్రతీరోజు ఉదయకాల ప్రార్థనకు వచ్చి మందిరములో ప్రార్థన చేసికోమని చెప్పారు. నేను ఆ విధంగా చేశాను. తెలిసిన సంఘస్తులు నాకు ధైర్యం చెబుతున్నారు. కాని దైవికస్వస్థత పుస్తకంలోని శక్తివంతమైన మాటలు నన్ను బలపరచినవి. నాకు పాటలు పాడడం ఇష్టం. కాని మాట్లాడం కష్టమైన స్థితిలో మందిరంలో ప్రార్థించుకొని వెళ్లాను. అమ్మగారితో ప్రార్థన చేయించుకొన్నాను. టెన్షన్‌లో ఉన్నప్పుడు అమ్మగారు 'భయపడకు, దేవుడు నిన్ను సేవలో వాడుకుంటాడు. నీవు దేవునికి కావాలి' అని ధైర్యపరచి ప్రార్థించారు. అమ్మగారు అలా ధైర్యపు మాటలు, ఆదరణ కలిగించే మాటలు చెప్పకుంటే నేను అధైర్యపడి క్రుంగిపోయి స్వస్థత పొందేవాడిని కానేమో. అమ్మగారి ప్రార్థనవలన నేను సంపూర్ణ స్వస్థత పొందాను. ఇప్పుడు చక్కగా పాటలు పాడుచున్నాను. అంతా నార్మల్ అయ్యింది. మరియు అమ్మగారు ప్రతి ఆదివారం నా తలపై చెయ్యిపెట్టి నా రాకపోకల్లో కాపుదలకొరకు ప్రార్థన చేస్తారు. నేను బాలాజీనగర్‌లో ప్రతి ఆదివారం పరిచర్య చేస్తాను. 2016 ఆగస్ట్ చివరి ఆదివారం నేను, నా భార్య బండిపై వెళ్తున్నప్పుడు మా ముందు వెళ్తున్న బండి ఎటువంటి సూచనలు ఇవ్వకుండా హఠాత్తుగా ఆగింది. మేము వెంట్రుక వాసిలో దాని దగ్గరగా ఆగాము. మా వెనుక వస్తున్న ఒక ట్రాలీ అది గమనించకుండా వేగంగా వచ్చి మా బండిని ఢీ కొట్టి వెళ్లి పోయింది. మా బండికి చిన్న నష్టం కలిగింది. మాకు ఎటువంటి ప్రాణాపాయం కలుగకుండా కాపాడిన దేవునికి స్తోత్రములు. అమ్మగారికి వందనములు.

**18. జి. కమలమ్మ, జెమినీ కాలనీ:** మా పెద్ద కోడలికి 10 సంవత్సరాలుగా పిల్లలు లేరు. మేము అమ్మగారి ప్రార్థనద్వారా అనేక ఆశీర్వాదములు పొందాము. అమ్మగారి ప్రార్థనవలన మా పెద్ద కుమారునికి మందిరము దగ్గరలో ఇల్లు దొరికింది. వారు ఒంగోలునుండి ఇక్కడికి వచ్చి సంఘ సహవాసంలో ఎదుగుతున్నారు. మా కోడలిని అమ్మగారి దగ్గరకు ప్రార్థనకు తెస్తే అమ్మగారు ప్రార్థన చేసి మందిరంలోకి వచ్చి ప్రార్థన చేసికో అని చెప్పారు. ఆమె 2015లో జరిగిన 40 రోజుల సిలువ ధ్యానములకు వచ్చి ప్రార్థించుకొంది. అమ్మగారు ఆమెకు పిల్లలు లేరు గనుక యు.పి.ఎఫ్. క్యాలెండర్ ఇచ్చి గర్భఫలంకొరకు ప్రార్థించారు. దేవుడు ఆమె గర్భము తెరచి చక్కని ఆరోగ్యకరమైన అందమైన కుమార్తెను అనుగ్రహించాడు. దేవునికి స్తోత్రములు. అమ్మగారికి వందనములు.

## యు.పి.ఎఫ్. ఇతర సేవా కార్యక్రమాలు

- ప్రతి ఆదివారము **"ప్రభాత ఆరాధన"** ఉదయము 6.00గం॥ల నుండి 9.00గం॥ల వరకు.
  స్థలము : యు.పి.ఎఫ్., రాంనగర్ విలాసములో
- ప్రతి ఆదివారము **"ఇంగ్లీషు ఆరాధన"** సాయంత్రం 4.00గం॥ల నుండి 6 గం॥ల వరకు మరియు **"తెలుగు ఆరాధన"** సాయంత్రం 6.00గం॥ల నుండి రాత్రి 8.30 ని॥ల వరకు.
  స్థలము : ఉస్మానియా గార్డెన్ ఫంక్షన్ హాల్, జామై ఉస్మానియా రైల్వే స్టేషన్ ఎదురుగా, అడిక్‌మెట్, హైదరాబాద్ - 500 044.
- ప్రతి ఆదివారము **"సండే స్కూల్"** ఉ॥ 7.00గం॥ల నుండి 9.00గం॥ల వరకు. (స్థలము : యు.పి.ఎఫ్. విలాసములో)
- ప్రతి రోజు **"ఉదయకాల ప్రార్థన"** ఉ॥ 4 గం॥ల నుండి 7 గం॥ల వరకు
- ప్రతి సోమవారము "మెన్స్ ప్రేయర్ ఫెలోషిప్" సాయంత్రం 6.00 గం॥ల నుండి 9.00 గం॥ల వరకు.
- ప్రతి సోమవారము **"తల్లి - కుమార్తెల సహవాసము"** సా॥ 6 గం.ల నుండి రా॥ 8.30 ని.ల వరకు.
- ప్రతి మంగళవారము "దేవుని వెయ్యి నామములు" ఉ॥ 10.00 గం॥ల నుండి మ॥ 1.00 గంట వరకు.
- ప్రతి మంగళ, బుధవారములలో "బైబిల్ కాలేజి తరగతులు" సా॥ 6.00 గం॥ల నుండి రాత్రి 9.00 గం॥ల వరకు.
- ప్రతి గురువారము **"ప్రకటన గ్రంథ వ్యాఖ్యానము"** సాయంత్రం 6.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల వరకు.
- ప్రతి శుక్రవారము **"ఉపవాస ప్రార్థన"** ఉ॥ 4 గం॥ల నుండి ఉ॥ 7 గం॥ వరకు మరియు ఉ॥ 10.00 గం॥ల నుండి మ॥ 1 గం॥ వరకు మరియు సా॥ 5.00 గం॥ల నుండి రాత్రి 8.30 ని॥ల వరకు. **రోగుల కొరకు ప్రత్యేక ప్రార్థనలు చేయబడును.**
- ప్రతి శనివారము **"వృద్ధుల సహవాసము"** మ॥ 2.00 గం॥ల నుండి సాయంత్రం 5.00 గం॥ల వరకు. **"యౌవన పురుషుల సహవాసము"** సా॥ 6.00 గం॥ల నుండి రాత్రి 8.30 ని॥ల వరకు.
- ప్రతి నెల మొదటి శనివారము "సేవకురాండ్ర సదస్సు" ఉ॥ 10.00 గం॥ల నుండి మ॥ 2.00 గం॥ల వరకు. **యు.పి.ఎఫ్. రాంనగర్‌లో**
- ప్రతి నెల రెండవ శనివారము "ప్రత్యేక ఉపవాస ప్రార్థన" ఉ॥ 10.00 గం॥ల నుండి సా॥ 4.00 గం॥ల వరకు
  స్థలము:యు.పి.ఎఫ్., రాంనగర్ విలాసములో.
- ప్రతి నెల ఆఖరి బుధవారము "సంపూర్ణ రాత్రి పార్థన" రాత్రి 9.00 గం॥ల నుండి ఉ॥ 5.00 గం॥ల వరకు
  **స్థలము: సెంటినరి బాప్టిస్ట్ చర్చ్, సికింద్రాబాద్.**
- అవసరతల చొప్పున గృహ కూడికలు, గృహ సందర్శనములు, రోగులకొరకు ప్రార్థనలు జరుపబడును.

# పుస్తకములు & సి.డి. పరిచర్య

జాయ్ చెరియన్ గారు ప్రసంగించిన ప్రసంగములు సి.డి. రూపములో మీకు అందుబాటులో ఉన్నవి. యు.పి.ఎఫ్. ఆఫీసులో మీకు లభ్యమగును.

పోస్టుద్వారా పుస్తకములు కావలసినవారు పుస్తకాల వెలతోపాటు పోస్టల్ ఛార్జీ అదనంగా యం.ఓ. ద్వారా పంపగలరు.

| | |
|---|---|
| దేవుని వెయ్యి ఆదేశములు (1-300) (సి.డి.) | వెల రూ. 30/- |
| మీ హృదయము కలవరపడనియ్యకుడి (వి.సి.డి.) | వెల రూ. 30/- |
| నా ప్రాణ ప్రియుడు (వి.సి.డి. & సి.డి.) | వెల రూ. 30/- |
| నూతన సంవత్సర తీర్మానములు (వి.సి.డి.) | వెల రూ. 30/- |
| క్రిస్మస్ వేడుకలు (డి.వి.డి.) | వెల రూ. 30/- |
| కాపరి లక్షణములు (వి.సి.డి.) | వెల రూ. 40/- |
| తల్లులకు హెచ్చరికలు (వి.సి.డి.) | వెల రూ. 40/- |
| విశ్వాసి యాత్ర కీర్తనలు (MP3) | వెల రూ. 40/- |
| దేవుడు కోరునది (వి.సి.డి.) | వెల రూ. 40/- |
| ఆశీర్వాదమునకు రహస్యము విధేయత (వి.సి.డి.) | వెల రూ. 40/- |
| దేవునికి ఇచ్చుటలో దీవెన (వి.సి.డి.) | వెల రూ. 40/- |
| దేవుని వెయ్యి నామములు (MP3) | వెల రూ. 40/- |
| నిన్ను విడువను నిన్ను ఎడబాయను (వి.సి.డి.) | వెల రూ. 40/- |
| నూతన సంవత్సరము - దిద్దుబాటు (వి.సి.డి.) | వెల రూ. 40/- |
| జ్ఞానవంతురాలు (వి.సి.డి.) | వెల రూ. 40/- |
| శుభకరమైన ఆనవాలు (వి.సి.డి.) | వెల రూ. 40/- |
| విశ్వాసురాలైన తల్లి (వి.సి.డి.) | వెల రూ. 40/- |
| సిలువ ధ్యాన కీర్తనలు (MP3) | వెల రూ. 40/- |
| దేవుని యొద్దనుండి ఒక మాట (వి.సి.డి.) | వెల రూ. 40/- |
| నన్నాశ్రయించుడి, నన్నాశ్రయించినయెడల మీరు బ్రతుకుదురు (వి.సి.డి.) | వెల రూ. 40/- |
| సంఘ పరిచర్యలో స్త్రీలు (వి.సి.డి.) | వెల రూ. 40/- |
| మీరు లోకమునకు వెలుగైయున్నారు (వి.సి.డి.) | వెల రూ. 40/- |
| క్రొత్త మనస్సు (వి.సి.డి.) | వెల రూ. 40/- |
| క్రైస్తవ కుటుంబము (వి.సి.డి.) | వెల రూ. 40/- |
| పరలోక రాజ్యముయొక్క తాళపుచెవులు (వి.సి.డి.) | వెల రూ. 40/- |
| బలిపీఠంమీద నిత్యం అగ్ని మండుచుండవలెను... (వి.సి.డి.) | వెల రూ. 40/- |
| స్త్రీలు - పరిశుద్ధత, పరిశుభ్రత (వి.సి.డి.) | వెల రూ. 40/- |
| ప్రభువా! నాకు సహాయము చేయుము (వి.సి.డి.) | వెల రూ. 40/- |
| ఆయన సమస్తమును మనకు అనుగ్రహించును (సి.డి.) | వెల రూ. 40/- |
| స్త్రీలు మౌనముగా ఉండవలెనా? 1 & 2 (వి.సి.డి.) | వెల రూ. 50/- |
| ఇది మొదలుకొని నేను మిమ్మును ఆశీర్వదించెదను. (డి.వి.డి.) | వెల రూ. 50/- |
| హృదయపరీక్ష (MP3) | వెల రూ. 60/- |
| సంగీతముతో కూడిన 1000 దేవుని నామములు (సి.డి.) | వెల రూ. 100/- |
| సంగీతముతో కూడిన 1000 దేవుని వాగ్దానములు (సి.డి.) | వెల రూ. 100/- |

**ఈ క్రింది పుస్తకములు కావలసినవారు మా చిరునామాను సంప్రదించండి :**

| | |
|---|---|
| "దేవుని వెయ్యి నామములు" - Vol - I<br>1-100 ప్రసంగాల పుస్తకము (తెలుగు) | వెల రూ. 100/- |
| "దేవుని వెయ్యి నామములు" - Vol - II<br>101-200 ప్రసంగాల పుస్తకము (తెలుగు) | వెల రూ. 100/- |
| "దేవుని వెయ్యి నామములు" - Vol - III<br>201-300 ప్రసంగాల పుస్తకము (తెలుగు) | వెల రూ. 100/- |
| "దేవుని వెయ్యి నామములు" - Vol - IV<br>301-400 ప్రసంగాల పుస్తకము (తెలుగు) | వెల రూ. 100/- |
| "దేవుని వెయ్యి నామములు" - Vol - V<br>401-500 ప్రసంగాల పుస్తకము (తెలుగు) | వెల రూ. 100/- |
| "దేవుని వెయ్యి నామములు" - Vol - VI<br>501-600 ప్రసంగాల పుస్తకము (తెలుగు) | వెల రూ. 100/- |
| "దేవుని వెయ్యి నామములు" - Vol - VII<br>601-700 ప్రసంగాల పుస్తకము (తెలుగు) | వెల రూ. 100/- |
| "దేవుని వెయ్యి నామములు" - Vol - VIII<br>701-800 ప్రసంగాల పుస్తకము (తెలుగు) | వెల రూ. 100/- |
| "దేవుని వెయ్యి వాగ్దానములు" - Vol - I<br>1-100 ప్రసంగాల పుస్తకము (తెలుగు) | వెల రూ. 100/- |
| "దేవుని వెయ్యి ఆదేశములు" - Vol - I<br>1-100 ప్రసంగాల పుస్తకము (తెలుగు) | వెల రూ. 100/- |
| "హృదయ పరీక్ష" 40 ప్రసంగాల పుస్తకము (తెలుగు) | వెల రూ. 150/- |
| "అద్భుత కార్యములు" - Vol - I | వెల రూ. 100/- |
| "అద్భుత కార్యములు" - Vol - II | వెల రూ. 100/- |
| "విశ్వాసి యాత్ర కీర్తనలు" (1000 పాటలు) | వెల రూ. 120/- |
| "దైవిక స్వస్థత" పుస్తకము (తెలుగు) | వెల రూ. 10/- |
| "నన్ను మలిచిన నా దేవుడు" జాయ్ చెరియన్‌గారి అనుభవసాక్ష్యము(తెలుగు) | వెల రూ.10/- |
| "పక్షిరాజు" పుస్తకము (తెలుగు) | వెల రూ. 10/- |
| "రహస్య పాపములు" పుస్తకము (తెలుగు) | వెల రూ. 10/- |
| "అమ్మ మాటలు" పుస్తకము (తెలుగు) | వెల రూ. 10/- |
| "మండుచున్న కాగడ" పుస్తకము (దేవుని పరిచర్యలో స్త్రీలు)(తెలుగు) | వెల రూ. 10/- |
| "వెయ్యి నామములు" పుస్తకము (ఇంగ్లీషు, తెలుగు&హిందీ) | వెల రూ. 10/- |
| "వెయ్యి వాగ్దానములు" పుస్తకము (ఇంగ్లీషు మరియు తెలుగు) | వెల రూ. 10/- |
| "వెయ్యి ఆదేశములు" పుస్తకము (ఇంగ్లీషు మరియు తెలుగు) | వెల రూ. 10/- |

"నా నామమున మీరు నన్నేమి అడిగినను నేను చేతును." - యోహాను 14:14

**యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్ (UPF) నిర్వహించు**

## సంపూర్ణ రాత్రి ప్రార్థన

**అందరికీ ఆహ్వానము**

**తేది : 26 అక్టోబరు 2016 (బుధవారం)**

**సమయము : రా॥ 9 గం॥ల నుండి ఉ॥ 5 గం॥ల వరకు**

**స్థలము : సెంటినరి బాప్టిస్ట్ చర్చ్, క్లాక్ టవర్ దగ్గర, సికింద్రాబాద్.**

RNI. No. APTEL 2007/24270



**మీకు మీ సెల్‌లో ప్రతి రోజు దేవుని వాక్యము కావలెనా?**

ప్రతి రోజు దేవుని వాగ్దానము SMS మీ సెల్‌ఫోన్‌లో పొందాలంటే ఈ ఫారమ్ పూర్తి చేసి ఈ దిగువ నున్న అడ్రస్ కు పంపండి. ఒక్క ఫారమ్ ఒక్క నెంబర్‌కే పరిమితం.

**యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్**
**UNITED PEOPLE'S FELLOWSHIP (UPF)**
# 1-9-52/E/3, Ramnagar, Hyderabad - 500 020. Phone : **27624030/1**

Name / పేరు: ______________________

Address
చిరునామా : ______________________

______________________

______________________ PIN : | | | | | | |

Your Church Name
మీ సంఘము పేరు : ______________________

Mobile Number for SMS subscription / SMS సభ్యత్వం కొరకు సెల్ నంబర్

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| | | | | | | | | | |

Date : ............................................ Signature

## ప్రకటన

ప్రార్థించండి! పాల్గొనండి!

**యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్ (UPF)**
**1-9-52/E/3, రాంనగర్, హైదరాబాద్-20.**
**Ph : 040-27624030, 27624031**

**ప్రతి ఆదివారము**

### ఉదయకాల ఆరాధన

ఉ॥ 6 గం॥ల నుండి ఉ॥ 9 గం॥ల వరకు

స్థలము : యు.పి.ఎఫ్., రాంనగర్ విలాసములో

మరియు

### సాయంకాల ఆరాధనలు

**ఇంగ్లీష్ : సా॥ 4 గం॥ల నుండి సా॥ గం॥ 6 గ॥ల వరకు**

**తెలుగు: సా॥ 6 గం॥ల నుండి రాత్రి గం॥ 8-30 ని॥ల వరకు**

స్థలము : ఉస్మానియా గార్డెన్ ఫంక్షన్ హాల్,
జామై ఉస్మానియా రైల్వే స్టేషన్ ఎదురుగా, అడిక్‌మెట్,
హైదరాబాద్ - 500 044. తెలంగాణ.

**అందరికీ ఆహ్వానము** - జాయ్ చెరియన్

**యు.పి.ఎఫ్. ఆధ్యాత్మిక టి.వి. కార్యక్రమము**

## "జీవపు మాటలు"

**కల్వరి** ఛానెల్‌లో
ప్రతి రోజు ఉ॥ 5.30 గం॥లకు మరియు ఉ॥ 10.00 గం॥లకు

**రక్షణ** ఛానెల్‌లో
ప్రతి రోజు ఉ॥ 6.00 గం॥లకు

**సి.టి.ఎన్.** ఛానెల్‌లో
ప్రతి రోజు ఉ॥ 6.30 ని॥లకు

**గాస్పెల్** ఛానెల్‌లో
ప్రతి రోజు ఉ॥ 10.30 ని॥లకు మరియు రా॥ 7.00 గం॥లకు

**ఆరాధన** ఛానెల్‌లో
ప్రతి రోజు మ॥ 2.00 గం॥లకు

**మెట్రో** ఛానెల్‌లో (హాత్‌వే నెం. 19)
ప్రతి రోజు రాత్రి 8.00 గం॥లకు మరియు
ప్రతి సోమవారము ఉ॥ 7.00 గం॥లకు

**శుభవార్త** ఛానెల్‌లో
ప్రతి శుక్రవారము మ॥ 2.30 ని॥లకు

జాయ్ చెరియన్ గారు దైవ వర్తమానమును అందించెదరు. వీక్షించి, దైవాశీర్వాదము పొందండి. ఈ కార్యక్రమము కొనసాగించుటకు ప్రార్థించండి, సహకరించండి.

ప్రభు సేవలో
- జాయ్ చెరియన్

మా చిరునామా :

**యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్ (UPF)**
# 1-9-52/E/3, రాంనగర్ ఈ-సేవ కు
ఎదురుగా ఉన్న గౌతమ్ హైస్కూల్ వీధి,
మూడవ కుడి మలుపు, రాంనగర్, హైదరాబాద్-20.
ఫోన్ : 040-27624030, 27624031

*VISIT US AT :*
*Email : joycherian@hotmail.com,*
www. unitedpeoplesfellowship.org

ఆడియో ద్వారా ప్రసంగాలు వినాలన్నా, దేవుని వెయ్యినామముల ప్రసంగములు మీరు ఇంగ్లీషు భాషలో చదువవలెనన్నా, మా వెబ్‌సైట్‌ను దర్శించండి

**www.unitedpeoplesfellowship.org**

**Owned, Edited, Printed & Published by : JOY CHERIAN, United People's Fellowship,**
**# 1-9-52/E/3, Opp. Ramnagar e-seva Gowtham High School Lane, Third Right Turn,**
**Ramnagar, Hyderabad - 500 020, (T.S.), INDIA. Ph : 040-27624030, 27624031**
Printed at : Sandhya Printing Works, # 1-7-1002/7/4/8, Ramnagar 'X' Road, Hyderabad - 500 020. Ph : 27619862